# అవధాన పుష్కరిణి

అంతర్జాల మాసపత్రిక

సంపుటి: 1 సంచిక: 8 పరాభవ - వైశాఖ శుద్ధ విదియ, 19 ఏప్రిల్ 2026



## గాడేపల్లి వీర రాఘవశాస్త్రి

(1891 - 1945)

శా॥ ఉష్ణాంశుప్రతిమానతేజ! ధృతరాష్ట్రోర్వీశ! నీ సూనుఁ డీ
కృష్ణున్ సర్వజగత్ప్రపూర్ణుఁడని యొక్కింతైన లోనెంచకే
తృష్ణాపాశవినిర్గతాత్ముడయి బంధింపంగఁ దా నెంచ హో
యుష్ణీషంబునఁ గట్టవచ్చునె? మదవ్యాధోగ్ర శుండాలమున్

ప్రచురణ
అవధాన విద్యా వికాస పరిషత్
భాగ్యనగరం

అవధాన విద్యా విజయతే తరామ్



20.03.2026న రవీంద్రభారతి మినీహాలులో
'అవధానపుష్కరిణీ' మార్చి సంచిక ఆవిష్కరణ



మౌలాలి, హైదరాబాద్‌లో శ్రీరంగగిరి దివ్య సన్నిధిలో
'శతావధాన విద్వన్మరాళ' ఆముదాల మురళి గారి అష్టావధానం
సందర్భంగా అవధానపుష్కరిణీ ఆవిష్కరణ

# అవధాన పుష్కరిణి

సంపుటి - 1 | అంతర్జాల మాస పత్రిక | సంచిక - 8

పరాభవ - వైశాఖం 2026    19-04-2026    ప్రచురణ: అవధాన విద్యా వికాస పరిషత్


శ్రీయుతమై రసైకలహరీసితమై, వివిధావధాన వి
ద్యాయతధీకవీశ్వరులు తామరలై విరియన్ - తదీయ వి
జ్ఞేయ సుపద్యమాధురు లశేషబుధాళుల కింపు విందుగా
నీ యవధాన పుష్కరిణి - ఈప్సితమై వెలుగొందు నందమై

- డా. జి.యం.రామశర్మ, శతావధాని


## సంపాదక వర్గం

**ప్రధాన సంపాదకులు**
మరుమాముల దత్తాత్రేయశర్మ

**సహసంపాదకులు**
కె.వి.ఎన్. ఆచార్య
కౌండిన్య తిలక్

**గౌరవ సలహాదారులు**
నారుమంచి వేంకట అనంతకృష్ణ శర్మ
మరుమాముల వేంకటరమణశర్మ
కంది శంకరయ్య

**సంపాదకవర్గం**
డా॥ జి.యం.రామశర్మ
ఆముదాల మురళి
డా॥ సంగనభట్ల నరసయ్య
మారేపల్లి వేంకట పట్వర్ధన్
ఆచార్య ఫణీంద్ర
చిటితోటి విజయకుమార్
చింతా రామకృష్ణారావు

**రూపకల్పన:** పంతుల విట్టుబాబు
**అక్షరాలంకరణ:** విరివెంటి సాహితీసుధ



**కార్యాలయం**
శ్రీరామ సదనం, 29-1499/6/1,
వెస్ట్ కాకతీయ నగర్, రోడ్ నం.1,
నేరేడుమెట్టు, సికిందరాబాద్ - 500 056
ఫోన్: 9441039146



అవధాన విద్యా వికాస పరిషత్ సేవాకార్యక్రమాలకు ఆర్థికంగా సహకరించదలచిన సహృదయులు ఫోన్ పే ద్వారా స్పందించగలరు.


అవధానవిద్యా విజయతే తరామ్

## సంపాదకీయం

### ప్రత్యక్షమా! పరోక్షమా?

కరోనా మహమ్మారి యావత్ప్రపంచాన్ని కుదిపి వేసింది. ఎందరినో బలితీసుకొని పోయింది. విశ్వానికే కొత్త పాఠాలునేర్పింది. కొత్తవిద్యలు లోకానికి చూపించింది. వాటిలో ప్రశస్తమైంది ఇంట్లోనే కూర్చుని పనులుచేయడం. (Work from home). అవధానరంగంలోనూ వచ్చిన పెనుమార్పు జూమ్ అవధానాలు. గత ఐదేళ్ళలో కొన్ని వేల జూమ్ అవధానాలు జరిగాయి. ఇప్పటికీ ప్రతి రోజు ఎక్కడో ఒకచోట జూమ్ అవధానాలు జరుగుతూనే ఉన్నాయి. అవధానాలకు వాడుతున్నంత విస్తారంగా మరో ప్రక్రియకు దీన్ని వాడుతున్నారా అనేంత అనుమానం కలిగేలా జూమ్ జామ్‌గా అవధానాలు సాగుతున్నాయి. వీటికోసమే కొత్త కొత్త సంస్థలు పుట్టుకొస్తున్నాయి. పరోక్షంగా ఎక్కడో జరుగుతూ ప్రత్యక్షంగా మనకళ్ళముందు కనబడే అంతర్జాల మాయా విశేషమే జూమ్ అవధానం.

ప్రత్యక్షంగా దర్శిస్తున్నవారికి అవధానప్రదర్శన రుచించినంత అందంగా పరోక్ష అవధానం ఉండదనేది వాస్తవం. అప్రస్తుత ప్రసంగానికో, అవధాని గారి ధారాపాత కవిత్వానికో, పూరణానైపుణ్యానికో ఆశ్చర్యచకితులయ్యేవారే సభలో ఉంటారు. సాధారణ జనం వచ్చినా కాస్సేపు అలా ఉండి వెళ్ళినా ఉన్నంతసేపు మంత్రముగ్ధులౌతారు. అలాంటిది జూమ్‌లో ప్రోగయ్యే వారి సంఖ్య చాలా పరిమితం. ఎందరు ఉంటారో, ఎప్పుడు వెళతారో తెలియదు. ఎవరూ ఎవరిని కట్టడి చేయడం సాధ్యపడదు. తెరలపై చూస్తున్న వాళ్ళైనా స్పందించే అవకాశం చాలా తక్కువ. (సంక్షిప్త సందేశాలు మాత్రం పంపవచ్చు). ఎన్నో పరిమితులున్నప్పటికీ జూమవధానాలూ జనంలోకి వెళ్ళడం విశేషం.

సాంకేతిక పరిజ్ఞానం ఉన్నవాళ్ళే ప్రష్టలుగా అవధానులుగా రాణిస్తారు.

ఒకరు మాట్లాడేప్పుడు ఇంకొకరు మాట్లాడితే గందరగోళం తప్పదు. ఏది ఏమైనా అభిముఖంగా సభలోకూర్చున్న సహృదయుల మధ్య చేసేఅవధానంలా ఉండదన్నది నిష్ఠుర సత్యం. ఆన్లైన్ అవధానం నిర్వాహకులకు మాత్రం మేలు కలిగిస్తుంది. ఎందుకంటే సభా వేదిక, పూలదండలు, జ్ఞాపికలు, మైకులు, లైట్లు, రంగాలంకరణ, బ్యానర్లు, స్టేషనరీ, భోజన ఫలహారాదుల వంటి ఖర్చులేవీ ఉండవు. అవధానిగారికి, సంచాలకులకు, ప్రష్టలకు సంభావనలిచ్చే పనీ ఉండదు.ఎవరికీ రాకపోకల ఛార్జీలిచ్చే అవసరంలేదు. హాయిగా ఇంట్లో కూర్చొని సభ జరిపి

(మిగతా 2వ పేజీలో)

# సంస్తుతి



## అమ్మకు నమస్సులు

డా. గరికిపాటి నరసింహారావు

సీ. గర్భమందున నేను కడుపు చుమ్మలు చుట్ట
సుడి సుడి గుండాల సోలిపోయి
పిన్ననాటను నేను వెన్నబాలును మెక్కి
నవ్వ నా నవ్వులన్ నానిపోయి
ఒడలు తడిసినంత ఓసి నా నాన్నని
తుడిచి సేవలు చేసి తూలిపోయి
ఎదుగుచుండిన నాకు ఏ స్వర్గ మడిగినన్
తెచ్చి ముంగటబెట్టి తెరలిపోయి
గీ. ముసలిదై యున్న మా యమ్మ మూగ ప్రేమ
నాకు అవధాన వేళలో నవ కవిత్వ
పద వికాస ప్రకాశ ప్రభావ మిచ్చి
బ్రోచు గావుత వెన్నంటి కాచి యుండి

**భావం:** గర్భ గోళంలో నేను రూపుదిద్దుకొనేవేళ కడుపులో తిరుగుళ్ళు పెట్టే కాలంలో మా అమ్మ ఎంతో సోలిపోయి ఉంటుంది. చిన్న వయస్సులో నేను వెన్న, పాలు, మీగడ మెక్కుతూ నవ్వుతూ ఉండగా నా నవ్వుల్లో నానిపోయింది. నా ఒళ్ళు రకరకాలుగా తడిసినవేళల్లో "ఓసి నా నాన్నా" అంటూ తుడిచి సేవలు చేసి తూలిపోయింది. క్రమక్రమంగా ఎదుగుతూ ఉండే సమయంలో నేను ఏ స్వర్గాల్ని అడిగినా "అవి తీరని కోరికలు" అనకుండా ఆ స్వర్గాల్ని నా ముందుకు దించి ఆనందంతో తెరలిపోయింది.

ఇన్నీ చేసి ఇప్పుడు ముసలివగ్గె ఉన్న మా అమ్మ మూగ ప్రేమ నేను అవధానం చేసే సమయంలో క్రొత్త కవిత్వాన్ని, పదాలకు అందాన్ని, కాంతిమంతమయిన ప్రభావాన్ని ఇచ్చి నాకు వెన్నుదన్నుగా ఉండి కాపాడుతుంది.

### (సంపాదకీయం)

వందన సమర్పణ చేసేయవచ్చు. ఐతే ఒకటిమాత్రం నిజం. ప్రపంచంలో ఏమూల ఉన్న వాళ్ళనైనా జూమ్‌తో ఒక్క దగ్గరికి చేర్చవచ్చు. అందుకే పరోక్షావధానాలు ఫోన్, ట్యాబ్, కంప్యూటర్ తెరలపై విరివిగా ప్రత్యక్ష మౌతున్నయి. ఉత్సాహవంతులు పెరిగారు. అలా సాధనగా జూమ్‌లో ప్రారంభం చేసిన కొందరు ప్రత్యక్షంగా కూడా చేస్తున్నారు ఇది శుభపరిణామం. రానున్న రోజుల్లో ఇంకెన్ని విపరిణామాలు చూస్తామో?

## ఇదీ క్రమణిక


1. కావ్యాస్వాదన ... ... ... ... ... ... ... ... 3
2. సత్కవి ప్రతిభకు తార్కాణం సమస్యాపూరణం.. 4
3. విశిష్ట తెలుగు భాషా వైభవం... ... ... ... .. 5
4. పద్యపరీమళం ... ... ... ... ... ... . 6,22,23
5. నిఘంటుపరిజ్ఞానం... ... ... ... ... ... ... 8
6. అవధానవేదిక ... ... ... ... ... ... ... ... 10
7. 'అవధాని'గా తొలి తెలుగు ప్రధాని!.. ... ... . 12
8. పూరణతోరణం ... ... ... ... ... ... . 13
9. శ్రీరామస్తుతి ... ... ... ... ... ... ... 15
10. పద్యకవిత్వము సాధుప్రయోగాలు ... ... .. 16
11. వ్యాకరణ వరివస్య ... ... ... ... ... ... .. 17
12. కావ్యశాస్త్రగవేషణ ... ... ... ... ... ... ... 18
13. ఖండశర్కర ... ... ... ... ... ... ... ... . 20
14. సంస్కృత సంస్కృతి ... ... ... ... ... ... 24


## సుహృద్వాణి

ఇదియొకసాహితీ యుగమయెన్ గద చిత్రవిచిత్రభావనా
స్పదపదపద్యకేళి బుధసారసచిత్తమరందమాధురీ
సుధ రసవంతమై కవనసుందరి సుందరమందహాసమై
మెదడుకు మేతగా ప్రతిభమేకొన వ్యాకరణాదిశాస్త్రసం
విదితపటుత్వశబ్దచయవేదికగా నవధానకర్తకున్
పదలయలూపు నూయెలగ పండితగోష్ఠికిపల్కరింపుగా
చదువరికిన్ నిఘంటువుగ సంహితగా తనరారె శారదా
హృదయసరోజపీఠపయి కృత్యముహృద్యముగావిభాసిలన్

– చక్రాల లక్ష్మీకాంత రాజారావు

అవధాన పుష్కరిణి ని ఆసాంతం పఠించాను . చాలా బాగుంది అవధానులకు అలాగే పద్య రచన చేసేవారికి అందరికీ ఉపయోగపడే విధంగా అందిస్తున్న సంపాదకులు మొదలుకొని సహచరసభ్యులందరికీ నమోవాకములు అభినందనలు. – ముత్యంపేట గౌరీశంకర శర్మ

సావధానచిత్తంతో అవధానపుష్కరిణిని సమర్థంగా నిర్వహిస్తున్న సంపాదకవర్గానికి అభినందనలు. రాబోవు కాలంలో కాబోవు అవధానులకు ఇది ఒక కరదీపిక.

– కుంతి, హైదరాబాద్

# యయాతి చరిత్ర

## డా. ఆచార్య ఫణీంద్ర

తలపడు జేజేలు బొలసు దిండ్లును గొండ
 గలచిన నాటి యంకిలి యొకింత
యెరుగడు తనలోన నే ప్రొద్దు బాయక
 యేర్చు వార్వపుటగ్గి యెగ్గు మదిని
మరచె జాల్పేరింటి మగువ నేలిన వేల్పు
 ములుకు వేడిమి నింకి కలగ బడుట
యెరుగడు మత్తిల్లి పరటి పుట్టువు గ్రుక్క
 గొనిన యప్పుడు గల కుతిల పాటు
నయ్యయాతి కడంగి నెయ్యమున బుడమి
వేల్పులకు బైడి యొసగెడు విడుపు నీట
నిండి కొద యేమియును లేక యుండె గడలి
యతని చాగంబు లిక నెన్న నలవి యగునె?

తొలి అచ్చ తెనుగు కబ్బం – “యయాతి చరిత్ర” లోని తొలి ఆశ్వాసంలో 95 వ పద్యం ఇది. కవి పొన్నికంటి తెలగన ఇంతకు ముందు చెప్పుకొన్న పద్యంలో కావ్య కథానాయకుడు యయాతి భూపతి శౌర్యాన్ని, వ్యక్తిత్వాన్ని ప్రశంసించగా, ఈ సీస పద్యంలో – యయాతి మహారాజు దాన గుణ వైభవాన్ని, ఆలంకారికంగా వర్ణించి చెప్పడం విశేషం.

ముందుగా ఈ పద్యంలో మన తరం తెలుగు వారికి కొరుకుడు పడని కొన్ని అచ్చ తెనుగు పదాలను పరిశీలిద్దాం –

1.జేజేలు = దేవతలు; 2.పొలసు = మాంసము; 3.పొలసు తిండి = మాంసమును భుజించువాడు .. అనగా రాక్షసుడు – (ఇప్పుడీ మాట బహిరంగంగా అంటే మాంసాహారులంతా యుద్ధానికి దిగుతారేమో!); 4.కొండ గలచు = (మందర) పర్వతంతో మథించు; 5. అంకిలి = కలత లేక క్షోభ; 6.ఏర్చు = బాధించు; 7.వార్వపుటగ్గి = బడబాగ్ని; 8.ఎగ్గు = కీడు; 9.చాల్పేరు = నాగటిచాలులో పారే నీరు. (సంస్కృతంలో నాగటిచాలును ‘సీతా’ అంటారు. అందుకే సీతాదేవికి ఆ నామకరణం చేసారని ఐతిహ్యం.); 10. “చాల్పేరింటి మగువ” అన్న అచ్చ తెనుగు మాటల మూటకు – జనక మహారాజు దున్నగా ఆ నాగటిచాలు తడిలో ఆయన ఇంటి ఆడపడుచుగా లభ్యమైన సీతాదేవి అని అర్థం.); 11.ములుకు వేడిమి నింకి = బాణపు పదునైన కొన తాకి; 12.కలగబడు = కలవరపడు; 13.పరటి = కుండ; 14. పరటి పుట్టువు = కుంభ సంభవుడు. (పురాణాలలో వశిష్ఠుడు, అగస్త్యుడు, ద్రోణుడు వంటి మునీశ్వరులు కుంభ సంభవులు); 15. గ్రుక్కగొను = మ్రింగు; 16. కుతిలము = బాధ లేదా దుఃఖము; 17. కుతిలపాటు = బాధపడుట; 18. కడంగి = పూనుకొని; 19. నెయ్యమున = స్నేహ భావంతో; 20. పుడమి వేల్పులు = భూసురులు (అనగా .. బ్రాహ్మణులు); 21. పైడి యొసగెడు విడుపు నీట = స్వర్ణ దానము చేసేప్పుడు ధారవోసే నీరు.

ఇక ఈ పద్య భావాన్ని పరిశీలిద్దాం. పొన్నికంటి తెలగన యయాతి విభుని వితరణ శీలాన్ని ప్రస్తుతించేందుకు – సముద్రుని గతాన్ని త్రవ్వి, అప్పటి లోటుపాట్లను వివరించి, ఈ దానాల వలన అవన్నీ తొలగిపోయి సముద్రుడు ఊరడిల్లాడని చెప్పడం ఒక చమత్కారం. సీస పద్యంలోని ఒక్కొక్క పాదంలో ఒక విధంగా సముద్రుని వృత్తాంతాలను ఎత్తి చూపాడు కవి.




మొదటి పాదంలో – సముద్రుడు .. దేవతలు, రాక్షసులు మందర పర్వతంతో చిలికినప్పుడు నాడు కలిగిన బాధను ఇప్పుడు తలపోయడం లేదట. రెండవ పాదంలో – తనలో ఎల్ల వేళలా బాధిస్తున్న బడబాగ్ని కష్టం సాగరునికి తెలియడం లేదట. మూడవ పాదంలో – సీతాదేవి పతిదేవుడైన శ్రీరామచంద్రుని పదునైన బాణపు కొస తగిలి పొందిన ఆనాటి కలవరపాటును మరచిపోయాడట. నాలుగవ పాదంలో – అగస్త్య మహర్షి తనలోని నీటినంతా ఒక్క గ్రుక్కలో ఆపోశన పట్టినప్పుడు కలిగిన బాధంతా .. ఈ కొత్త రకమైన మత్తులో మునుగడం వలన సముద్రుడు తెలియకుండా ప్రవర్తిస్తున్నాడట.

ఇంతకీ ఈ బాధలన్నీ ఎట్లా విస్మరించగలిగాడట? ఆ హేతువును ఎత్తుగీతిలో ఎత్తిచూపాడు కావ్యకర్త. ఆ యయాతిరాజు పూనుకొని స్నేహ భావంతో భూసురులకు స్వర్ణ దానాలు చేస్తున్నప్పుడు ధారవోసిన నీరంతా తనలో నిండడం వలన గతంలోని ఆ బాధలన్నీ మరచిపోయి, తనకే లోటు లేనట్టుగా సముద్రుడు హాయిగా ఉంటున్నాడని చెప్పడం ఒక చమత్కారం! పద్యం అంతిమ పాదంలో – ఇట్లా .. ఆ యయాతి ప్రభువు చేసిన దానాలను లెక్కించడం సాధ్యమా? ఽ అని ప్రశ్నించడం మరొక చమత్కారం!!

ఇక ఈ పద్యంలో పొన్నికంటి తెలగన కవి కావ్యాలలో అరుదుగా కనిపించే “పూర్వరూపాలంకారా”న్ని ప్రయోగించడం మరొక విశేషం. “స్వగుణమును విడచి, మరల తన స్వగుణమును గ్రహించినట్టు వర్ణించినచో – అది ‘పూర్వరూపాలంకారం’ అని ‘చంద్రాలోకం’ అనే అలంకార శాస్త్ర గ్రంథంలో వివరించబడింది. తెలగన కవి ఈ పద్యంలోని సీస పద్య పాదాలలో – సముద్రుడు అనేక విధాలుగా తన స్వగుణాన్ని కోల్పోయినట్టుగా; తిరిగి “ఎత్తు గీతి” పద్యంలో యయాతి రాజేంద్రుని వదాన్య గుణంతో .. మరల ఆ స్వగుణాన్ని పొందినట్లు చెప్పి, ఈ పద్యాన్ని “పూర్వరూపాలంకారం” తో శోభిల్ల జేసిన విధానం – బహుధా ప్రశంసనీయం!




# సత్కవి ప్రతిభకు తార్కాణం - సమస్యా పూరణం

– శతావధాని **డా॥ జి.యం. రామశర్మ**

అవధాన రంగంలో అద్భుత ప్రయోగాలు చేసిన శతావధానులలో అగ్రేసరులు శ్రీవేంకటరామ కృష్ణ కవులు శ్రీ ఓలేటి వేంకటరామశాస్త్రి(1883-1939) శ్రీ వేదుల రామకృష్ణశాస్త్రి (1889-1918) కలిసి జంట కవులై అత్యద్భుత శతావధానం, శతవిధానం, శతప్రాపము వంటి విలక్షణ ప్రయోగాలతో అవధాన సరస్వతికి క్రొత్త వన్నెలను సంతరింప జేసారు. వారు శతావధానాన్ని నాలుగు గంటలలో పూర్తి జేయగలమని శ్రీ పిఠాపురం రాజావారికి ఈ క్రింది పద్యంతో ఒక విజ్ఞాపన పత్రాన్ని పంపారు.

ఉ॥ చేయుట కొక్కగంట, అది చెప్పిన చొప్పున దప్పకుండగా
వ్రాయుట కొక్కగంట, సరివారలతో నవధాన ధారణా
స్థేయత కొక్కగంట, అపదెంచిన పెద్దల గారవింప నొం
డో, యరగంటయో వ్యవధి యుండవలెన్ ధరణీపురందరా!

అన్నదాన్ని అక్షరాల నిరూపించుకొంటూ శ్రీపిఠాపురం రాజావారి ఆస్థానంలో ఆ జంటకవులా నాడు నిర్వహించిన శతావధానానికి పరవశులైన రాజావారు ఆ కవులను 'అత్యద్భుత శతావధానులు' అనే బిరుదాన్నిచ్చి సత్కరించారు. అది చిరత్రలో నిలిచిన అత్యద్భుత శతావధానం.

ఒక అవధాన సభలో వారికి **'కుండను గొండ సొచ్చె నిదిగోయని పల్కెను విస్మయంబునన్'** అను వింత సమస్య నీయగా దాన్ని వారు మనోహరంగా ఇలా పూరించి జేజేలనకిందుకున్నారు.

ఉ॥ కొండలు రేగి లోకముల గుండలు సేయుచునుండ జూచి, ఆ
ఖండలు దుద్ధతుండయి, యఖండ పరాక్రమ మొప్ప రెక్కలన్
జెండ గడంటుం దెలిసి, శీతనగా త్మజు డబ్ధి వజ్రి రా
కుండను గొండ సొచ్చెనిదిగో! యని పల్కెను విస్మయంబునన్

'కుండలోనికి కొండసొచ్చినది' అనేది సమస్యలోని అసంగతాంశం. ఈ పూరణకైవారు పౌరాణికాంశాన్ని తీసుకున్నారు. పూర్వం పర్వతాలకు రెక్కలుండేవి. అవి పక్షుల వలె ఎగిరి జనావాసాల మీద పడుతుండెడివి. భారీగా జననష్టం వాటిల్లేది. బాధితులంతా ఇంద్రుని శరణు వేడడంతో ఆయన వజ్రాయుధధారియై పర్వతాల రెక్కలను నరకడం మొదలు పెట్టాడు. అది తెలుసుకొన్న హిమవత్పర్వత నందనుడైన మైనాకుడనే గిరివరుడు ఇంద్రుని నుండి తప్పించుకొని సముద్రాంతర్భాగంలో దాగాడు. ఈ భావక్రమంలో సమస్యలోని 'కుండను' అనే పదం "వజ్రి రాకుండను"(అంటే వజ్రాయుధ ధారి అయిన ఇంద్రుడు రాకుండునట్లుగా) అనే పదంగా మలచడంతో ఈ పూరణ ఎంతో చమత్కృతిమంతమైంది. మరొక అవధానసభలో ఈ వేంకటరామకృష్ణ కవులకు **'రాతికి కోతి పుట్టె రఘురాముని కైవడి సీత కైవడిన్'** అనే సమస్యనీయగా వారు సరసంగా ఇలా పూరించారు.

ఉ॥ ఖ్యాతి యొసంగ నంజనకు గల్గిన శ్రీహనుమాను జూచి సం
ప్రీతిని జెంది దేవతలు పేరిమి జెప్పుకొనంగ సాగిరా
భూతలమందు రావణుని పొల్పడగింపగ నిప్పుడంధకా
రాతికి కోతి పుట్టె రఘురామునికై-వడి సీతకై-వడిన్

శివాంశ సంభూతుడైన ఆంజనేయస్వామి పరంగా సాగినా మనోజ్ఞపూరణ ఇది. కీర్తి ఇనుమడింపగా అంజనాదేవికి పుట్టిన హనుమంతుని జూచి ఆనందించిన దేవతలు. "భూమిపై రావణుని ఉద్ధతిని అణచుట కొరకై రఘురాముని కోసమై సీతకోసమై వడివడిగా అంధకారాతి(అంధకాసురుని శత్రువు) యైన శివునికి తదంశతో కోతి రూపంలో ఆంజనేయస్వామి జన్మించాడు" అని గొప్పగా చెప్పుకోసాగారు.

సమస్యలోని 'రాతికి' అనే పదం 'అంధకారాతికి (అంధక+ అరాతి) అనే పదంగా రూపొందడంతో పూరణ చాల అర్థవంతమై శోభిస్తున్నది సమస్యలోని రఘురాముని కైవడి, సీత కైవడిన్ అనే పదాలను చిన్న విరుపు మెరుపుతో రఘురామునికై వడి, సీతకై వడిన్ అని సాధించడంతో పద చమత్కారం పరమ రమణీయంగా భాసిస్తున్నది.

ఈ జంటకవులు పిఠాపురం రాజావారి ఆస్థానంలోనే ఒక రోజు రాజావారి కోరిక మేరకు ప్రహ్లాద చరిత్ర ఇతివృత్తంగా వంద పద్యాలను అశువుగా అనర్గళంగా చెప్పి శ్రోతలను ఉర్రూతలూగించారు.

కేవలం అవధాన ప్రదర్శనలకే పరిమితం కాకుండా ఈ జంటకవులు సువృత్త తిలకము. కవి కంఠాభరణము, క్షేమేంద్రుని ఔచిత్యవిచార చర్చ(పద్యానువాదము), వేంకటాధ్వరి పండితుని విశ్వగుణాదర్శము(పద్యానువాదము) మొదలైన నైక గ్రంథ రచనలతో సాహితీ సరస్వతీ సముపాసకులై వెలిగారు.

# విశిష్ట తెలుగు భాషా వైభవం
## 8 ఛందః ప్రాముఖ్యం




### గణాలు ఎలా పుట్టాయి?

- డా. సంగనభట్ల నరసయ్య

(గత సంచిక తరువాయి...)

పాదం ప్రమాణం కోసం తొలినాళ్లలో ఒక్కో అక్షరాన్ని లెక్కించారు. **"కశ్చిత్కాంతా విరహగురుణా స్వాధికారాత్ప్రమత్తః"** అనే పాదం ఉచ్చరించాలంటే ఎంత కాలం పడుతుందంటే UUUU IIIII - ఇలా లెక్కించి గురువుకు 2 మాత్రలు, లఘువొక మాత్రగా 27 మాత్రల కాలంగా చెప్పేవారు. ఇది సౌకర్యంగా లేదని చిన్నచిన్న గుంపులుగా విడగొట్టితే లెక్క త్వరగా (పత్రం లేకుండా) మనసుతోనే లెక్కించవచ్చని భావించారు. అవే గణాల ఏర్పాటుకు కారణం ఐనాయి. పై పాదాన్ని **మభనతతగ** అనే గణాలుగా లెక్కించి మాత్రల సంఖ్యను, గురు లఘుక్రమాన్ని గుర్తుపెట్టుకోవడం సులభమైందని గుర్తించారు.

రెండు అక్షరాలు గణంగా గుర్తించవచ్చు కానీ మరీ చిన్నగా అయి, ఒక్కో అక్షరం లెక్కించడం వల్ల కంటె రెండుగా లెక్కించడంలో పెద్దగా ప్రయోజనం (ఆశించినంత) నెరవేరదని భావించారేమో! మూడు అక్షరాల గణంగా లెక్కించారు. కానీ అక్షరం కొలత గురు లఘురూపంతో రెండేగా. అందువల్ల మరో గురువు లేదా లఘువు అదనంగా జోడించుకుంటే మూడు అక్షరాల గణం అవుతుంది. గురులఘువుల్లో ఏదో ఒకటి రెండు సార్లు రావడం జరుగుతుంది. గురువు మొదట తరువాత రెండు లఘువులు, గురు మధ్యంగా ఇటు అటు లఘువులు రెండు, గుర్వంతంగా ముందు రెండు లఘువులు, అలాగే ఇదే క్రమంలో రెండు గురువులతో మరో మూడు గణాలు, అన్నీ గురువులు అన్నీ లఘువులతో మరో రెండు గణాలు మొత్తం ఎనిమిది గణాలుగా పదాలు విభక్తమౌతాయని, ఇంతకుమించి మూడక్షరాల గణం సిద్ధం కాదని ప్రస్తరించుకొన్నారు. విస్తృత పాదాలతో వైవిధ్య సృష్టికి అంతే కొలతగల ఛందాల లెక్కకు ఈ ప్రస్తార విధానం అమలు చేసారు. దాంతో ఛందాల సంఖ్య పెరిగింది. దాంట్లో పుట్టే వృత్తాల సంఖ్య తెలిసింది. పదమూడు కోట్లపైన వృత్తాలు పుడతాయనే ఈ గణితశాస్త్రం షట్ప్రత్యయ విధానంగా ఛందశ్శాస్త్రంలో ప్రత్యేక అధ్యాయంగా అధ్యయనాంశం ఐంది. శాస్త్రం సమగ్రంగా ఉండాలని మన పూర్వ ఋషుల ఆకాంక్ష.

గణంకు పేరు పెట్టడం వెనుక సాంస్కృతిక కారణాలు ఏమీ లేవు. **'మభజసనయరత'** లని అక్షరసంకేతాలే. తాళ శాస్త్రంలో తకట అని అక్షరాలతో తకిట (త్ర్యస్ర), తకకిట (చతురస్ర), తకతకిట (ఖండ), తకిటతకతక (మిశ్ర) జాతి భేదాలకు (నడకల భేదాలకు) ఇదే పద్ధతి. ఈ పద్ధతిని ఛందశ్శాస్త్రజ్ఞులు మాత్రాచ్ఛందస్సులకు అక్షరాల కొలతకు వాడుకొన్నారు.

భగణం అంటే తొలిగురువని (మిగతా రెండక్షరాలు లఘువులేనని పరిశేషన్యాయంగా), జగణం అంటే మధ్య గురువని సగణం అంటే అంత్యగురువని గుర్తుపెట్టుకోవడం కూడా సులభంగా లేదని

**శ్లో॥ ఆదిమధ్యావసానేషు, యరతా యాంతిలాఘవం**
**భజసా గౌరవం యాంతి, మనౌతు గురులాఘవే**

వంటి చిట్కా శ్లోకాలు ఛందఃకర్తలు సృష్టించారు. **'మయరసతజభన'** అని వైదిక మంత్రాల్లో (ఈ వరుసలో) పేర్కొబడ్డ గణాలు సౌకర్యం కోసం **'యమాతారాజభానసలగం'** అనే చిట్కా వాక్యంలో గణక్రమం పై వలె వుండక విద్యార్థులకు ఇంకా సంక్షిప్తంగా గొలుసు నిర్మాణంలో ఉండేలా నిర్మించారు. యమాతాలో **'తొలిలఘు'**గణం సృష్టించి, య ఎగురగొట్టి మాతా రెండు గురువులే గనుక మరో గురువు చేర్చి రా కల్పి మాతారా చేసి, మా ఎగురగొట్టి తారా రెండు గురువులే గనుక మరో లఘువు చేర్చి (జ అనే అక్షరం చేర్చి) తారాజ అని చేసి ఈ క్రమంలో అక్షరాలను లఘువు / గురువుగా ఉచ్చరించే హ్రస్వ దీర్ఘోత్వాలు (రాజభా అనడాన్ని బదులు రజాభ అనకూడదా? అనే దానికి జవాబుగా) వీలుగా నిర్మాణం చేసిన ఆ ఋషి మేధలో వీటిని వరుసగా గాక సౌకర్యవంతంగా క్యూలో నిలబెట్టడంలో చాతుర్యం వుంది. ఐనా ఇది సగం ఫలితం ఇస్తుంది. గణం పేరు చెపితే గురులఘుక్రమం వస్తుంది. గురులఘుక్రమం (UIU అని) చెపితే గణం పేరు తెలుసుకోవడం ఈ యముని మంత్రంతో కుదరదు. పై చిట్కా శ్లోకమే ఉభయతారకం.

పై సంస్కృత గణవిధానం తెలుగువారికి సంస్కృతపద్యాలు రాసినపుడే అవసరం. లేకుంటే లేదు. తెలుగు పద్యాల్లో ఈ

(మిగతా 9వ పేజీలో)

# పద్యపరిమళం

- అన్నమరాజు ప్రభాకరరావు

## చతుర సంభాషణము

మరల అందుకొనినా దుదంకుడు

ఉ. కాదన కిట్టిపాటి యపకారము దక్షకు దేకవిప్ర సం
బోధన జేసి చేసె నృపపుంగవ ! నీవు ననేక భూసురా
పాదిత సర్పయాగమున భస్మము సేయుము తక్షకాది కా
కోదర సంహతిన్ హుతవహోగ్ర సమగ్ర శిఖాచయంబులన్
(ఆది 1- 124)

(ఈ పద్యములో ప్రాసస్థానములో అల్ప ప్రాణ మహాప్రాణ "ద కారము" ను స్థాపించి భావి పద్యరచయితలకు మార్గము సూపినాడు నన్నయ).

ఉత్తమోత్తముడయిన నీ తండ్రిని చంపినాడు తక్షకుడు. తన యంతట తాను చంపెనా? ఎవడో యొక బ్రాహ్మణ బాలకుడు సంబోధించిన యంతమాత్రమున "కాదనక" (విచారించక), యిట్టిపాటి (యింతటి ఘోరమైన) యపకారమును చేసినాడు. వాడు భుజగజాల్ముడు నీవు నృపపుంగవుడవు. వాడు విషాగ్నిచే చంపినాడు. వానిని నీవు యజ్ఞాగ్నిలో భస్మము సేయు మనినాడు. ఆ క్షణమ జనమేజయునిలో క్షత్రియ సహజమైన రజోగుణము విజృంభించినది. తక్షకుని శిక్షింపవలయుననెడు నిశ్చయము కలిగినది. కానీ, తక్షకుడు చేసిన యపకారమునకు "తక్షకాది కాకోదర సంహతి" నంతయు నేల చంపవలయును? ఈ ప్రశ్నను జనమేజయుని ముఖములో గమనించిన యుదంకుడు...

ఉ. ప్రల్లదుడైన యొక్క కులపాంసను చేసి దాన దత్కులం
బెల్ల దూషితంబగుట యేమి యపూర్వము - గావునన్ మహీ
వల్లభ ! తక్షకాధము నెపంబున సర్పములెల్ల నగ్నిలో
ద్రెళ్లగ సర్పయాగ మతి ధీయుత చేయుము విప్రసమ్మతిన్
(ఆది 1 - 125)

అనినాడు. ఎవడో యొక్క ధూర్తు డపకారము సేసిన వాని కులమంతయును నశించుట పూర్వమున్నదే. ఆలోచించినాడు జనమేజయుడు. ఆ ప్రల్లదుడైన కులపాంసుడు తన పూర్వీకుల లోననే యున్నాడు - ధార్తరాష్ట్రాగ్రజుడైన దుర్యోధనుడు. వాడు ద్రౌపదికి చేసిన యవమానమునకు వాని కులమంతయు నశించినది. నాశన మొనర్చినవాడు తన ముత్తాతయైన ధర్మజుడు. ధర్మజు నంతటి మహాత్ముడే తన భార్య కపకృతి చేసినవాని వంశమును నిర్మూలించినాడు. నీవు పాండవుడవు "కావునన్" ధర్మాత్ములైన నీ పూర్వజుల ననుసరింపుమని సూచన. ఉదంకుడు నేరుగా దుర్యోధనుడు చేసిన యపకృతిని ప్రస్తావించలేదు. జనమేజయుడు రాజు. సభలో నున్నాడు. తన వంశమునకు చెందిన మహారాణి యొక్క దుస్థితి సభాముఖముగా వినినచో కించపడును. కనుక వాచ్యముగా కాక వ్యంగ్యముగా చెప్పినా దుదంకుడు. పైగా, నిర్ణయము నీవు స్వయముగా తీసికొన నక్కర లేదు. ధర్మజ్ఞులైన "విప్రసమ్మతితో" యాగము సేయుమనినాడు.

ఇచట ఉదంకుడు కేవలము నాలుగు "(ఆ)వృత్తము"లలో సాత్త్వికుడును ధర్మపరాయణుడునునైన జనమేజయునికి సర్పయాగ బుద్ధి పుట్టించినాడు. ఈ బుద్ధి పుట్టించిన వైఖరి యపూర్వము. బహు విషయ పరిజ్ఞానము, అప్రతిహతమైన లోకజ్ఞత, వచోదక్షత, సూక్ష్మ సూక్ష్మతర మనఃపరిశీలనము వంటి లక్షణముల నుదంకునిలో భాసింపజేసినాడు నన్నయ.

రెండవ భాగములో దీనికి పూర్తి విపరీతమైన ఫలితము రావలయును. అది చూతము. మేనమామయైన వాసుకి ప్రార్థన నాలించి, తల్లియైన జరత్కారువు కోరిక మేరకు నాగబుషి యైన యాస్తీకుడు యజ్ఞక్రియామగ్నుడైన జనమేజయుని సమీపించి స్వస్తి పూర్వకముగా

మ. రజనీనాథకులైక భూషణుడవై రాజర్షివై ధారుణీ
ప్రజ నెల్లన్ దయతోడ ధర్మచరితం బాలించుచుం దొంటి ధ
ర్మజు నాభాగు భగీరథున్ దశరథున్ మాంధాతృ రామున్ రఘున్
విజయుం బోలితి సద్గుణంబుల జగద్విఖ్యాత పారీక్షితా !
(ఆది 3-221)

(ఇచ్చట - అనంతరకాలములో పోతన భాగవతములోని వామనుడు బలిచక్రవర్తికి స్వస్తివాచకము పలికిన "స్వస్తి జగత్రయీ భువన శాసన కర్తకు....... అను పద్యము జ్ఞప్తికి వచ్చును) అని జనమేజయుని సర్వ పూర్వభూపాలకోత్తములతో సమానముగా నిల్పినాడు. సరిగా నెనిమిదిమందితో నుపమించి యష్ట దిక్కులయందును నీ కీర్తి విస్తరిల్లినదని సూచించినాడు. దీనితో జనమేజయుని కాస్తీకుని మాటల యందు శ్రద్ధ పుట్టినది. ఇచ్చట కొన్ని విశేషములున్నవి. "ధారుణీ ప్రజ నెల్లన్ - లోకములోని సమస్త జీవులను, దయతోడ - నీకు దయాగుణమున్నది. సహజాతము. "ధర్మచరితన్" పాలించు చున్నావనినాడు. నీ తండ్రి కేనాడో జరిగిన యపకారము ఆతని కర్మఫలము. అది నీవు నెఱుగుదువు. ఇంతకాలము తరువాత ప్రతీకారేచ్ఛ తగదు. ఎవడో ఒకడు చేసిన పనికి సమస్త సర్పజాతిని నాశనమొనర్చ బూనుట ధర్మము కాదు అని ధ్వని. రెండవ విశేషము - ఇచ్చట భూపాలురను

పేర్కొనుటలో చంద్రవంశోత్తముడైన ధర్మజునితో ప్రారంభించినాడు. దానితో జనమేజయుని మొగమిటు తిరిగినది. పనిలో పనిగా భూపతి కాకపోయినను విజయుని (అర్జునుని) కూడా ప్రస్తావించినాడు. యాగాత్పూర్వము ఉదంకుని వలెనె ఇప్పుడు ఆస్తీకుడు కూడా జనమేజయుకి నేరుగా సంబంధించిన విజయు నుపయోగించుకొని, అర్జునునిలోని ధీరలాలిత్యము జ్ఞప్తికి దెచ్చినాడు. ఉదంకుని కంటే కూడా ఆస్తీకుడు చివరలో "పారీక్షితా" యని సంబోధించినాడు. ఇది ఆస్తీకుని యాత్మవిశ్వాసము. తండ్రిని గుర్తు చేయుట ద్వారా ప్రతీకారేచ్ఛ రెచ్చునని భావించుటకంటె నాతని మరణాత్పూర్వము కేవలము దినసప్తకమే యైనను భగవత్కథా శ్రవణము ద్వారా గడిపిన యాధ్యాత్మ జీవనము స్ఫురింపజేయుట యుద్దిష్టము. అదియును గాక, యాగకృత నిశ్చయుడైన జనమేజయుడు తన సంకల్పమును మంత్రులతో చర్చించినప్పుడు వారు పరీక్షిత్తు యొక్క ఘనతను బహుధా ప్రశంసించి యున్నారు. జనమేజయున కింకను ఆత్మీయతా భావ ముప్పొంగి అనుకంప పొడసూపినది.

ఇప్పుడు జనమేజయుని ముఖకవళికలు గమనించిన ఆస్తీకుడు **"అమ్మను జేంద్రుడైన నలు యజ్ఞము.........."** (ఆది 2-223) అనుచు పూర్వ మహాత్ములు చేసిన యజ్ఞముల కంటె నిప్పుడు నీవొనర్చుచున్న యజ్ఞ మేమాత్రము తగ్గదనినాడు. అటు పిమ్మట యిప్పటి నీ యీ యజ్ఞములో హోతలు, ఉద్గాతలు, అధ్వర్యులు, బ్రాహ్మలుగా నున్నవారు సాక్షాత్తు **"కమలగర్భ సమానులు"** (ఆది 2-224) అనినాడు. ఆ తరువాత "త్రిజగద్విఖ్యాత తేజు"డైన కృష్ణద్వైపాయనుడు **"సుత శిష్య బ్రహ్మసంఘంబుతో"** సదస్యుడైనాడనిన నీవు భూపతులలో విష్ణుసన్నిభుడ వనినాడు (ఆది 2-225).

అప్పుడు ప్రీతి చెందిన జనమేజయుడు నీకు ప్రియమైనది కోరుకొమ్మనినాడు. వెంటనే ఆస్తీకుడు

ఉ. మానిత సత్యవాక్య ! యభిమన్యు కులోద్వహ ! శాంతమన్యుసం
తానుడవై దయాభినిరతస్థితి నీవు మదీయ బంధుసం
తానమనోజ్వరం బుపరతంబుగ నాకు బ్రియంబుగా మహో
రీ్వనుత సర్పయాగ ముడిగింపుము కావుము సర్పసంహతిన్
(ఆది 2-228)

సర్పయాగ ముడిగించి సర్పజాతిని కావుమనినాడు. **"మానిత సత్యవాక్య"** అనినాడు. పూర్వ ముదంకుడు **"మిత హిత సత్యవాక్య"** అనినాడు. అయన చంపకమాల యీయన ఉత్పలమాల - వ్యత్యాసమిదియే. ఉదంకుడైనను ఆస్తీకుడైనను కార్యార్థులై వచ్చినారు. సామోపాయముతోడనే కార్యము సాధించు కొనవలసి యున్నది. తదనుగుణమైన వాక్సారళ్యమును నన్నయ రెండు సందర్భములలోనను నిర్వహించినాడు.

ఈ సందర్భములో నన్నయ యౌచిత్యము చూడుడు. కోరిక తీర్చెదననిన జనమేజయుడు వెన్వెంటనే యాగము నిలుపుదల కాజ్ఞాపించలేదు. తన మిత్రుల యొక్కయు, సదస్యుల యొక్కయు మొగములు చూచినాడు. అనగా, వారి యభిప్రాయమును కోరుచున్నాడు. (మితహిత సత్యవాక్య శోభితుడు కనుక మాటలు లేవు). **"అనిన సర్వజనానుమతంబుగా జనమేజయుం డాస్తీక ప్రార్థనం జేసి సర్పయాగం బుడిగించె"** (ఆది 2-230 వ.). వారి యనుమతి యెందులకు? యాగాత్పూర్వము తనకు కలిగిన సంకల్పమునకు వారి యనుమతి గైకొనినాడు గనుక, యాగము నిలుపుదలకును వారామోదించవలె. విశేషించి సదస్యులు. ఏల యన నప్పటికే **"తక్షకుం దురువిషార్చుల్ దూల వాత్యారయోద్ధతి నుద్ధూత వివర్ధితాయత బృహద్దావాగ్ని పోలెన్ విచేష్టితుడై మేఘపథంబులం దిరుగు"**చున్నాడు గనుక (ఆది 2-231). ఇట్టి స్థితిలో యాగమును నిలుపుట సాధ్యమా? కావున సదస్యు లంగీకరించవలె. వారంగీకరించినారు. యాగమాగినది. ఆస్తీకుడు సంతుష్టుడైనాడు. ఉదంకుడు తక్షకుని మృతసదృశు జేసినాడు కనుక సంతుష్టుడు. ఈ యుపాఖ్యానములో నాద్యంతము నన్నయ సంభాషణములు నడిపిన తీరుగాని, పరోక్షముగా కథనము ద్వారా సంభాషణములను / సన్నివేశములను స్ఫురింపజేసిన విధానము గానీ అత్యద్భుతము.

**ప్రకటన**

అవధానకళ భావితరాలకు నిరంతరాయంగా ప్రవహింపజేయడంలో మా వంతు కృషిగా అవధాన విద్యను యువతరానికి బోధించడానికి, **'అవధాన విద్యా వికాస పరిషత్తు'**ను ఏర్పాటు చేసి **2022**వ సంవత్సరం నుండి నాలుగేళ్ళుగా 'భాగ్యనగరం'లో ఏడురోజులపాటు **'అవధాన శిక్షణ శిబిరాలను'** నిర్వహిస్తూ వస్తున్నాం. అలాగే ఈ **2026**వ సంవత్సరం కూడా **మే 18 నుండి 24 వరకు** శిక్షణ శిబిరం ఏర్పాటు జరుగుతుంది. వేదిక సెయింట్ మార్క్స్ హైస్కూల్, దీనదయాల్ నగర్, నేరేడుమెట్టు, మల్కాజిగిరి, హైదరాబాద్. వివరాలకు **9441039146, 8555082034** ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చు.

**- సంపాదకులు**

## ధనంజయ నిఘంటువు

నామమాల లేదా ప్రమాణ నామమాల అన్న ఈ నిఘంటువును ధనంజయుడు నిర్మించాడు. దిగంబర జైన సంప్రదాయమునకు చెందిన ఇతడు క్రీ. శ. 1123 ప్రాంతం వాడని సంస్కృతవాఙ్మయ చరిత్రలో బ్రహ్మశ్రీ మల్లాది సూర్యనారాయణశాస్త్రిగారు పేర్కొన్నారు. ఇది రెండు పరిచ్ఛేదాలను కలిగి ఉంది. మొదటి పరిచ్ఛేదం సంకీర్ణ శబ్ద నిరూపణం అన్న పేరులో 198 శ్లోకాలతోను, నానార్థ పరిచ్ఛేదమన్న ద్వితీయ పరిచ్ఛేదం 50 శ్లోకాలతోను వెరసి 248 శ్లోకాలు గల నిఘంటువు. రాశిలో చిన్నదే కాని వాసిలో మిన్న. ప్రతి అవధాని వద్ద జిహ్వాగ్రాలయగా ఉండదగినది.




ఈ నిఘంటువు పదాలను తయారు చేసుకొనే పద్ధతిని నేర్పుతుంది. మిగిలిన నిఘంటువు పదపదార్థాలను బోధిస్తాయి. ఈ నిఘంటువు ఏక సూత్రంపై నిర్మాణమయ్యే పర్యాయపదాలను బోధిస్తుంది. ఆ విశేషాలు సోదాహరణంగా తెలుసుకొందాం.

భూమిర్భూః పృథివీ పృథ్వీ గహ్వరీ మేదినీ మహీ,
ధరా వసుంధరా ధాత్రీ క్షమా విశ్వంభరాఽవనిః – (5)
వసుధా ధరణీ క్షోణి క్ష్మాధరిత్రీ క్షితిశ్చకుః
కుంభి నీలోర్వరోర్వీ గౌర్జగతీ వసుమత్యపి (6)

అను ఈ రెండుశ్లోకాల ద్వారా భూమికి 27 పర్యాయ పదాలు బోధించబడ్డాయి. అందులో భూః, క్ష్మా, కుః, గౌః అను నాలుగు ఏకాక్షర పదాలు కూడా ఉన్నవి. ఇలా, ఉర్వీ, అన్న పదాలను సంధిగతంగా వాడితే అవికూడా ఏకాక్షరాల వంటి సౌలభ్యాన్ని అవధానికి కల్పిస్తాయి. నైఘంటికులైన ధనంజయుడు ఈ పదాలను చెప్పి దాని తర్వాత ఒక సూత్రప్రాయమైన శ్లోకాన్ని చెబుతున్నారు.

తత్పర్యాయ ధరశ్శైలః తత్పర్యాయ పతిర్నృపః
తత్పర్యాయ రుహోవృక్షః శబ్దమన్యం చ యోజయేత్ – అనగా

భూమి పర్యాయ పదాలతో చేరిన ధరశబ్దమలు పర్వత వాచకమౌతుంది. ధర శబ్దము అనడం వల్ల ధర పర్యాయాలను కూడా స్వీకరించాలి. అంటే భూధర, భూధ్ర, భూభృత్... అలాగే ఇరవై ఏడు పదాలకు చేర్చుకోవాలి. ఇప్పుడు పాఠకునికి పర్వతానికి సంబంధించిన ఎనభై ఒక్క పర్యాయ పదాలు సిద్ధమైపోతాయి. శ్లోకంలో తర్వాత భూపర్యాయ పదాలకు పతి పర్యాయ పదాలు చేరిస్తే రాజు అనీ అర్థంగల పదాలు వస్తాయని, చెబుతుంది.

పతి శబ్దానికి ఏకాక్షర మైన ప, ధవ, భర్త, నాథ, అధిప, ఈశ్వర మొదలగునవి పర్యాయ పదాలు. భూప, భూధవ, భూభర్త, భూనాథ, ధరాధిప, భూమీశ్వర... ఇలా వందల పర్యాయ పదాలు రాజు అన్న అర్థంలో ఏర్పడుతాయి. ఇక పై శ్లోకంలో మూడవ సూత్రం భూమి పర్యాయ పదాలకు పుట్టుట అనే అర్థము నిచ్చే రుహ, జ, భవ, సంభవ అన్న పదాలు కలిస్తే వృక్షమునకు పర్యాయ పదాలు వస్తాయి. భూరుహ, భూజ, క్ష్మాభవ, మహీసంభవ.... ఇలా వందల సంఖ్యలో పదాలు ఏర్పడుతాయి. భూ పర్యాయ పదాల మీద రుహ పర్యాయ పదాలతో ఏర్పడే పదాలు స్త్రీలింగరూపాలు సీతకు పర్యాయపదాలు. వాటిమీద పతి పర్యాయపదాలు చేరిస్తే రామునికి పర్యాయ పదాలు. చెట్టు పర్యాయాల మీద చర శబ్దం చేరిస్తే కోతి పర్యాయ పదాలు వస్తాయి. ఈ విధంగా కేవలం మూడు శ్లోకాలతో రెండువేలకు పైగా పదాలు తయారు చేసుకొనవచ్చును. అవధాని యొక్క పదసంపద పెరగడానికి ఈ నిఘంటువు ఎంతో దోహదం చేస్తుంది.

వార్వారి జలమమ్భోఽమ్బు కమర్ణ స్సలిలం పయః
శరం వనం కుశం తోయం నీరంజీవన మబ్విషమ్ – అన్న శ్లోకంలో నీటికి 17 పర్యాయ పదాలున్నాయి. వాటిలో వాః, కం, అప్ అనునవి ఏకాక్షర పదాలు. అంభః, అమ్బు, అర్ణం పదాలను సంధిగతంగా ఏకాక్షరాలుగా వాడవచ్చు. ఈ నీటి పర్యాయపదాలకు చర శబ్దము చేరిస్తే చేప అనే అర్థం వస్తుంది; వారిచర, జలచర, అంబుచర మొదలగునవి. ప్రద లేదా ద అంటే ఇచ్చునది అని అర్థం, నీటి పర్యాయపదాలతో వీటిని చేర్చితే మేఘం అనే అర్థంలో 34 పదాలు వస్తాయి. ఇక పుట్టుక పర్యాయ పదాలైన జ, భవ, సంభవ, ఉద్భవ మొదలగు పదాలు చేర్చితే వచ్చే పదాలు తామరకు పర్యాయపదాలవుతాయి. జలజ, జలరుహ, జలోద్భవ వారి సంభవ మొదలగునవి. ధి, నిధి శబ్దాలు నీటి పర్యాయ పదాలతో చేరితే సముద్రమనే అర్థం వస్తుంది. జలధి, జలనిధి, అబ్ధి, వార్నిధి, కంధి, శరధి, వనధి ... ఇలా 34 పదాలు ఏర్పడతాయి. ఈ పదాలపై పుట్టుక

పర్యాయ పదాలను చేర్చితే లక్ష్మి పర్యాయపదాలు ఏర్పడతాయి. జలధిభవ, కంధిజ ఇత్యాదులు. వీటిని స్త్రీలింగాలుగా ప్రయోగించాలి.

ఇందులో కిరణము లేదా కాంతి అనే అర్థంలో 24 పదాలను రెండు శ్లోకాలలో ఇచ్చి "శీతోష్ణ ప్రాయ పూర్వత్వే తద్వంతా విందు భాస్కరౌ" అని సూత్రీకరించాడు ధనంజయుడు. అనగా ఈ కాంతి పర్యాయ పదాల ముందు శీత (చల్లని) పర్యాయపదాలు చేర్చితే చంద్రుడని, ఉష్ణ పర్యాయ పదాలు చేర్చితే సూర్యుడని అర్థం. శీతకరః, శీతాంశుః, శీతరుచిః, శీతకిరణః మొదలగునవి చంద్ర పర్యాయపదాలు. ఉష్ణభర, ఉష్ణాంశుః, ఉష్ణరుచిః, ఉష్ణ కిరణః మొదలగునవి సూర్య పర్యాయ పదాలు. హిమ, తుహిన, శిశిర పదాలు శీత పర్యాయ పదాలు కాగా తీక్ష్ణ, ఖర మొదలగునవి ఉష్ణ పర్యాయ పదాలు. రెండు శ్లోకాలతో చంద్రునికి 96, సూర్యునికి 76 పర్యాయ పదాలు నేర్చుకోవచ్చు. అలాగే శత్ర, మిత్ర పర్యాయ పదాలతో కూడా వందల పదాలు సృష్టించుకొనవచ్చును.

ఇందులోని రెండవ పరిచ్ఛేదములో నానార్థములు చెప్పబడినవి.

వనమంభసి కాంతారే భువనం విష్టపీఽర్ణసి,
ఘృతం సర్పిషి పానీయే విషంహాలాహలే జలే (4)

అనగా వనం = నీరు, అడవి; భువనం = లోకము, నీరు; ఘృతం = నేయి, నీరు; విషం = హాలహలం, నీరు – అని నానార్థాలు తెలుసుకోవాలి.

ఈవిధంగా ఎంతో అద్భుత రీతిలో నిర్మాణమై ఉన్న ఈ నిఘంటువు కవిత్వరచన చేసేవారికి, అవధానం చేసేవారికి పద సంపదను చేకూర్చు విజయపథంలో నడిపిస్తుంది.

(5వ పేజీ తరువాయి)

అరువు తెచ్చుకొనని తెలుగు జాతీయుల నిర్మాణమైన పద్యాలు దేశిచ్ఛందాలు అని రెండు విధానాలు ఉన్నాయన్న మాట. మార్గి విధానంలోని త్ర్యక్షర గణవిధానాన్ని, తెలుగులోని త్ర్యక్షర గణేతర విధానాన్ని తెలుగువారు (కవులు, పాఠకులు, శాస్త్రకారులు) తెలియవలసిన రెట్టింపు చదువు తెలుగు ఛందశ్శాస్త్రంలో వుంది. దీన్ని గుర్తించి పై చిట్కా శ్లోకాన్ని మరింత సులభంగా, అందంగా, చిన్నగా మల్లియరేచన రాసాడు. ఈయన తెలుగులో తొలి ఛందశ్శాస్త్ర రచయిత. రాయమంటే చాలు కందం రాసే ఈ పండిత కవి అన్నీ కందాల్లోనే **'కవిజనాశ్రయ'**మనే పేరుతో ఛందోగ్రంథాన్ని నేటి కరీంనగర్ జిల్లాలోని వేములవాడలో నన్నయకు వందయాభై ఏళ్ళ ముందే వ్రాసాడు. ఇంత సులభంగా రాసిన ఛందోగ్రంథం మరొకటి తెలుగులో లేదు. ఈయన త్ర్యక్షర గణాలు గుర్తుపెట్టుకునేందుకు వ్రాసిన రెండు కందాలివి.

**కం. గురువులు మూడిట మగణము**
**పరగంగా ఆదిగురువు భగణం బయ్యెన్**
**ధరమధ్య గురువు జగణము**
**సరస గుణా! అంత్యగురువు సగణం బయ్యెన్!**

**కం. లఘువులు మూడిడ నగణము**
**లఘువాద్యం బయ్యెనేని లలి యగణమగున్**
**లఘు మధ్యంబగు రగణము**
**లఘువంత్యము తగణమగును లాలితకీర్తీ!**

## తటిల్లతలు

ప్ర: "నాకు గుడి ఇవ్వ"మని అంటున్నారు. మీకు గుళ్ళూ మాన్యాలూ కూడా కావాలా?

అ: గుళ్ళల్లో పని చేసేవారికి గుళ్ళు కాక మరేం కావాలి.

ప్ర: సభల్లోగానీ, పుస్తకాల్లో గానీ అసలు విషయాన్ని చెప్పేముందు చెప్పేదాన్ని 'ఉపోద్ఘాతం' అని అంటారు. దీనిని 'ఉపోద్ఘాతం' అని ఎందుకంటారు? అసలు విషయాన్ని 'ఉద్ఘాతం' అని ఎందుకంటారు? అంత భయంకరమైనవా?

అ: 'ఉద్ఘాతం' అంటే మీరనుకున్నది కాదు...లోతైనది అని, అంటే లోతైన విషయం అందులో ఉందని. అందులోంచి ముందువారు కొంత త్రవ్వకొని వస్తారు కాబట్టి అది 'ఉప ఉద్ఘాతము'.

ప్ర: నదులు అధోగతులు కదా! మరి బ్రతుకును 'జీవనము' అని నదీప్రవాహంతో ఎందుకు పోలుస్తారు?

అ: అది కూడా అటే పోతుంది కాబట్టి చివరకి

ప్ర: 'మారుడు' అంటే మన్మథుడు కదా! మరి 'కుమారుడు' అంటే

అ: చెడ్డ మన్మథుడు మాత్రం కాదులెండి.

ప్ర: 'ఆ'కు 'చెఱువు' గలుప 'అచ్చెఱు'వగునట్లు
'ఈ'కి 'విధము' గలుప 'ఇవ్విధమ్ము'
'ఈ'కి 'స్త్రీ'ని గలుప 'ఇస్త్రీ'యె యగునేమొ?
తగున యిట్లనుట వధానివర్య!

అ: అక్కడ మనం ఏమీ కలపటానికి లేదు. ఏవిధంగా పులిహోర కలిపినా ఇస్త్రీ చేయటం మాత్రం ఖాయం.

## విజ్ఞానసమితి, ఖైరతాబాదు ఆధ్వర్యవములో
# బ్రహ్మశ్రీ మాడుగుల నాగగురునాథశర్మ గారి అష్టావధానం

21.03.2026




**ముఖ్యఅతిథి:** తాడేపల్లి పతంజలి
**సంచాలకులు:** మరుమాముల దత్తాత్రేయశర్మ

**నిషిద్ధాక్షరి:** చిటితోటి విజయకుమార్

శ్రీ(మ)కా(ర)ంతంబై (య) చి(ద)త్త
ప్రాకా(మ)రప్రా(భ)ణమై(న) ప్రభా(త)ర్ధ(స)శ్రీ(త)యై
ఆకారము ఆమనియై
రేకుల్ వికసించుగాక రేయింబవలున్

శ్రీకాంతంబై చిత్త
ప్రాకారప్రాణమై ప్రభార్ధశ్రీయై
ఆకారము ఆమనియై
రేకుల్ వికసించుగాక రేయింబవలున్

**సమస్య:** మండపాక మహేశ్వరి
"త్రాగెడివారు శ్రేష్టులని ధర్మము పల్కిరి యోగిపుంగవుల్"
యోగము రామచంద్రపద యుక్త సభక్తి విశేషరీతిగాన్
రాగ రసార్ణవంబు మధురాక్షర తారక మంత్రమైనచో
యాగఫలంబొ ఏమొ వినయంబుగ రామ రసంబునున్ సదా
త్రాగెడి వారు శ్రేష్టులని ధర్మము పల్కిరి యోగిపుంగవుల్

**దత్తపది-సాధన నరసింహాచార్య**
మమకార-సహకార-ఉపకార-అపకార
అంశం: యుద్ధము-శాంతి
మనసు మమకార మైనచో మంచి కలుగు
దేశదేశాల సహకార దీప్తితోడ
జగతికుపకారమేదన్న చైత్ర పథము
సలుపునపకారనాశంబు శాంతిరథము

**వర్ణన-భైరపనేని పోతురాజు చౌదరి**
"మణిద్వీపములో సుఖాసీనురాలైన అమ్మవారి సౌందర్యవర్ణన"
నవవిద్యార్ణవ శక్తిపీఠనిలయా నైష్కర్మ్య భద్రప్రభా!
భవ దుర్భేదన తంత్ర మంత్ర పదమా!వైరాగ్య సద్భాగ్యమా!
కవితా కారణ కార్య రూప కలనా! కల్యాణ సంధాయినీ;
శివమౌ నీకు నమశ్శతంబు జననీ! చింతామణీ ఆమనీ!

**న్యస్థాక్షరి - సరస్వతి దేవి వర్ణన**
**భువనగిరి పురుషోత్తమ్**
ప,రా,భ,వ-2,18,16,15 స్థానాలలో
శ్రీ పద బిందు మూల ఘనచిత్తము నందున శ్వేతవర్ణమై
వ్యాపితదివ్యదీప్తి శతవర్ణసమీకృత సుందరాఖ్యమై
చూపులు చాలు కావ్యములు శుభ్ర పదాకృతి భవ్య భావమై
చూపగదే సరస్వతి విశుద్ధ విధాన వరప్రసాదమై

**ఆశువు-పి.ఎల్.నాగేశ్వరరావు**
క్రొత్తగా వస్తున్న అవధానులను ప్రోత్సహిస్తూ..
వరలు అవధాన విద్యలో వైభవముగ
వెలుగు విద్యార్థులందరు విశ్వమందు
అమ్మ పాదాలు పట్టిన అందఱకును
కలుగు విజయంబు సత్యమౌ కాంతి కలుగు



భీష్మ-కర్ణ సంవాదము

స్నేహమేదియైన శేముషి కాదొకో
దుష్ట మిత్రులున్న దురితమెయగు
యుద్ధనీతి కాదు యోగంబు కుదరక
వినుడు భీష్మ వాక్కు విహిత దృక్కు

స్వరశ్రుతి-యుద్ధము-శాంతి-కృష్ణతత్త్వం
(ఆశువుగా స్వరాలాపనకు సాహిత్యం)
కొవ్వలి సత్యసాయి

ప: మదిలో మోహన రాగము పలికే
మౌనమునందున కృష్ణుడు వెలిగే
కదిలే జీవన సమరము ముంగిట
నిలిచిన గీతా రూపము తానే
శాంతి శాంతియను మంత్రము తానై
స్వస్తి పలుకగా మృదు వసంతమై

**అప్రస్తుత ప్రసంగము: అష్టకాల రామమోహన్**

మెట్రోలో ఆధార్ చెల్లదని వ్రాశారు.. ఏమిటి?
స: పురుషులకు చెల్లదు అని.
మీరు బ్యాంకు వారు కదా.. లోన్ ఇస్తారా?
స: ఎందుకూ అలోన్ గా ఉన్నారా? (అంటే లోన్ లేకుండా అని)
వెల్డింగ్ కు, వెడ్డింగ్ కు తేడా?
స: వెల్డింగ్ కొన్నాళ్ళకు పోతుంది..
వెడ్డింగ్ అలా కాదు అది చిరమైన బంధం.

## ఐఐటి హైదరాబాద్ ప్రాంగణంలో జరిగిన నల్లాన్ చక్రవర్తుల సాహిత్ గారి అష్టావధానం




**సంచాలకులు:** మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి

**నిషిద్ధాక్షరి:** డా.పాలపర్తి శ్యామలానందప్రసాద్

ప్రపత్తి కి విజ్ఞానానికి ఉన్న సంబంధము

మేనౌనా నిల సరిజూపున్
జ్ఞానం బిడువాని యురుత గాఢముగాగన్
కానన్ ప్రపత్తికమగు వి
జ్ఞానము సహకారి సత్త నవతన్ తెలుపున్

**సమస్య:** శ్రిష్టి చంద్రమౌళీశ్వర శర్మ

కారం బెక్కువ యయ్యె పాయసమునన్ కంజాతపత్రేక్షణా!చేరన్

వచ్చిన ప్రాణనాథునకు వాసిన్ తీపి గావింపగన్
క్షీరంబట్లుగ ప్రేమ అన్నముగ వాజ్నిర్మాణమున్ గూర్చి శృం
గార స్ఫూర్తి నొసంగ భర్త పలికెన్ గయ్యాళికిన్ ప్రీతి సం
స్కారం బెక్కువ యయ్యె పాయసమునన్ కంజాతపత్రేక్షణా!

**దత్తపది:** కటకం వేంకటరామశర్మ

'కంది' పదం నాలుగు పాదాలలో ప్రయోగిస్తూ ఐఐటి ఘనత

కందిన పాఠశాలలను కల్గిన భారతమందు మేలు మా
కందిన కొంగుపైడి భరతావని భూతియు పశ్చిమంపు ది
క్కందిన కాంతితో వెలుగ హాయిగ ఛాత్రుల నింజినీర్ల సో
కందిన సంస్థయైన ఐఐటికి వాటిలు కోటిశోభలున్

**వర్ణన:** పురాణం అనంతలక్ష్మీనారాయణ

వసంతఋతు వర్ణన

చిత్తముల్ చిగురింప కోకిల చిన్ని పాటలు పాడగా
మెత్తమెత్తనిపూలు తేనెలుమీరి పొంగుచు నుండగా
క్రొత్తరంగులు హంగులున్ సరిగూరి విశ్వము నిండగన్
సత్తమున్ పొగడంగ వసంతము సంత మోహన మై చనున్

**న్యస్తాక్షరి:** కస్తూరి శివశంకర్

1-1- స 2-6-ర 3-15-స్వ 4-21-తీ

ఐ ఐ టి కి తయారయ్యే పిల్లల శ్రమ, పట్టుదల

సరి నిదురింపకే ఉభయసంధ్యల నాటలనాడకుండ వే
సరి వడి తీరనప్పుడును సాధుప్రయత్నము మానకుండ వి
స్ఫుర దభిమన్యులై కదన శుభ్ర దరస్వనముల్ ఘటింపగన్
గురువులు మెచ్చు ఛాత్రజనకోటిని కంటివి ధన్య భారతీ!

అవధానపుష్కరిణి అన్ని సంచికలూ ఒకేచోట. ఈ QR కోడ్ స్కాన్ చేస్తే అంతర్జాలంలో ఇప్పటివరకు వచ్చిన అన్ని సంచికలూ ఒకేచోట కనపడుతాయి. అక్కడే చదువుకోవచ్చు లేదా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు

# 'అవధాని'గా తొలి తెలుగు ప్రధాని!

**- డాక్టర్ వి. వి. రామారావు.**

**పి.** వి. నరసింహారావుకు తెలుగు, సంస్కృత భాషలపట్ల అభిలాష చిన్నతనంలోనే కలిగాయి. కారణం వారి నాయన సీతారామారావు తన గుండెలపైన పడుకోబెట్టుకొని భారత భాగవత పద్యాలు వినిపించడమే!.. అయితే పి.వి. విద్యాభ్యాసం అంతా ఉర్దూ మీడియంలో జరగడం వలన తెలుగు భాషపట్ల మరింత మమకారం పెరిగింది. ఆయన ఇంటర్ నాగపూర్‌లో చదివి, బి.ఎస్‌సి. మాత్రం పూనేలో చదివి, ఎం.ఎస్సి. మాథమేటిక్స్ చేయాలనుకొన్నారు.. కానీ మనసు మార్చుకొని తిరిగి నాగపూర్‌లో లా చేశారు.. మరాఠీ భాషలో నిష్ణాతుడైనారు. ఇతర భాషాధ్యయనంచేసినపుడు మాతృభాష విలువ మరింత తెలుసుకున్నారు మన కావ్య, పురాణ, ఇతిహాస, ప్రబంధాలను అధ్యయనం చేసి, తెలుగు భాషా మాధుర్యానికి మురిసిపోయారు.. తెలుగులో తొలుత పద్యరచనకు ఉపక్రమించారు. అద్భుతమైన చక్కని చిక్కని పద్యాలెన్నో ఆశువుగా రాశారు.. అయితే ఆయన వాటిని గ్రంథస్థం చేయలేదు.. సాహిత్య ఆరాటం ఉన్నప్పటికీ స్వాతంత్ర్య పోరాటం వైపే మొగ్గు చూపారు.



1945 ప్రాంతంలో గార్లపాటి రాఘవరెడ్డిగారితో పరిచయం, పి.వి. సాహిత్య జీవనప్రస్థానంలో మలుపు తిప్పింది. రాఘవరెడ్డి గారిని గురువుగా భావించారు. కాళోజి, పాములపర్తి సదాశివరావు గారలకు కూడా గార్లపాటి రాఘవరెడ్డి గారే గురువు.. ఈ ముగ్గురివి వేరు వేరు మార్గాలు.. వేర్వేరు దృక్పథాలు.

పి.వి. పద్యకవితాభిమాని. ఎన్నో పద్యాలు ఆశువుగా రాసేవారని ఆయన అత్యంత సన్నిహిత మిత్రుడు సదాశివరావు గారనేవారు. వీరిద్దరు కలిసి కాకతీయ పత్రికను నిర్వహించేవారు 'జయ, విజయ' అనే కలం పేర్లతో జంటగా రచన చేసేవారు.. (ఆ తరువాత తన కూతుళ్ళకు జయ, విజయ అని పేర్లు పెట్టుకున్నాడు పి.వి.)

1950ల్లోనే పి.వి. తరచూ సాహితీ సమావేశాలకు హాజరయ్యేవారు. తిరుపతి వెంకటేశ్వర కవుల పాండవోద్యోగ విజయాలు పద్యాలను ధారణ చేసిన విషయం చాలా మందికి తెలియదు. 1950 దశకం చివరలోనో లేదా 1960 ప్రారంభంలోనో ధర్మపురిలో శతావధాని 'కోరుట్ల' కృష్ణమాచార్య గారి అవధానం జరిగింది. ఆ కాలంలో కాంగ్రేసు పార్టీ ఇన్‌ఛార్జ్‌గా ఉన్న పి.వి.గారిని, ఆయన సన్నిహిత సాహితీ మిత్రుడు, తెలుగు ఉపాధ్యాయుడు రొట్టె విశ్వనాథశాస్త్రి గారు ఆ అవధానానికి ఆహ్వానించారు. ఆనాటి అవధానంలో కొరిడె రామారావు ప్రభృతులు పాల్గొన్నారు. పి.వి. పృచ్ఛకునిగా పాల్గొన్నారని, ప్రఖ్యాత సాహితీవేత్త, సాహిత్య విమర్శకుడు, చరిత్ర పరిశోధకుడు, శ్రీ సంగనభట్ల నర్సయ్యగారు తన చిన్నతనంలో చూసిన ఆనాటి అవధానం గురించి ఈ వ్యాస రచయితకు వివరించారు.

సంస్కృత భాషా ప్రచారం కోసం కంకణం కట్టుకొన్న కాశీ కృష్ణాచార్యులు, అవధానంలో కొత్త అంశాలు ప్రవేశ పెట్టారు. వీరు 1961-67 మధ్య కాలంలో ఆంధ్రప్రదేశ్ ఆస్థానకవిగా సేవలందించారు. ఆ కాలంలో పి.వి. గారు 1962లో మొదటిసారి మంత్రి అయ్యాడు. 1962 నుండి 1964 వరకు జైళ్ళశాఖ న్యాయ, సమాచార శాఖ మంత్రి గాను, 1964 నుండి 67 వరకు న్యాయ, దేవదాయ శాఖ మంత్రి, 1967లో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రిగా పని చేశారు. ఆ కాలంలో కాశీ కృష్ణాచార్య గారితో అనేక సందర్భాల్లో కలిసి సాహితీగోష్ఠిలో పాల్గొనడమేకాదు అవధాన విద్యను పాఠ్యాంశంగా తెచ్చే అంశాన్ని పరిశీలించాలని నాటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డిని కోరారు.

సి. వి. సుబ్బన్న, దూపాటి సంపత్కుమారాచార్య, పేరాల భరత శర్మ, మామిడిపల్లి సాంబశివ శర్మ, దివాకర్ల వేంకటా వధాని, ప్రభృతుల అవధానాలకు హాజరవడమేకాదు ముఖ్య అతిథి హోదాలో పృచ్ఛకుని పాత్ర కూడా పోషించారు.

1975లో ప్రపంచ తెలుగు మహాసభలకు ముందు కోవెల సుప్రసన్న గారు వరంగల్‌లో అవధానం చేసినపుడు ముఖ్యమంత్రి హోదాలో హాజరవడమేకాదు ఆయన అవధాన ప్రతిభకు ఆశ్చర్యపడి "ఇదెప్పటినుంచి?" అని ప్రశ్నించారని ఈ వ్యాస రచయితతో సుప్రసన్న గారు నాటి అవధాన విశేషాలు నెమరు వేసుకున్నారు. నాటి సభలో పి.వి "ఏ భాషకు లేని ప్రత్యేకతను తెలుగు భాషకు సంతరించి పెట్టిన సాహిత్య ప్రక్రియ అవధానం .. ఇది మనసును ఉల్లాసపరచే శబ్దక్రీడే కాదు, బుద్ధిని మరింత పదును పెట్టే ఔషధం.. ధారణశక్తిని పెంచే సాధనం" అని ఉపన్యసించారంటే, పి.వి. తన రంగానికి అవధాన విద్యను ఎంతగానో అనువర్తించుకున్నాడని తెలుస్తుంది..

వానమామలై వరదాచార్య గారిపై పరిశోధన చేసిన కోరుట్ల నివాసి అష్టావధాని డా. అందె వెంకటరాజం గారి ఒక అవధానానికి పి.వి. హాజరయ్యారని ఆయన 1995లో ఆకాశ వాణి వరంగల్ కేంద్రంలో తన సాహితీ యాత్ర ప్రసంగంలో తెలిపారు.

ఇప్పటివరకు పి.వి.గారికి అవధానం పట్ల, అవధానులతో గల బంధం తో పాటు ఆయన పాల్గొన్న అవధాన సభల గురించి అందిన సమాచారం విశ్లేషిస్తే పి.వి.లో అవధాని వున్నాడని విదితమవుతుంది. పి.వి. దృక్పథంలో అవధానం అనేది సాహిత్యంలోనే కాదు ఇతర రంగాలకు కూడా వర్తిస్తుందని నిరూపితమైంది కూడా. నేత్రావధానం, గణితావధానం, నాట్యావధానం, భగవద్గీతావధానం మొదలైనవి కేవలం ఉదాహరణలు మాత్రమే. **(సశేషం)**

# పూరణతోరణం

నిర్వహణ: 'అష్టావధాని' కంది శంకరయ్య

## సమస్య

"కమలంబునఁ బుట్టెఁ గలువ గనులకు విందై"

**అన్నపరెడ్డి సత్యనారాయణ రెడ్డి, హైదరాబాదు**

ప్రమదము తోడుత చనగా
సుమనస్సాయకుని బోలు సొంపగు పతితో
కమలిని తటికిన్, రాతిరి
కమలంబునఁ బుట్టెఁ గలువ గనులకు విందై
(కమలము = నీరు)

**ఆకుల శాంతి భూషణ్, వనపర్తి**

రమ వదనము ఘన సురుచిర
కుముదము..,కనుదోయి యందు కువలయములుగా
నమరగ గని పలికి రిటుల
కమలంబున బుట్టెఁ గలువ గనులకు విందై

**ఆరవల్లి శ్రీదేవి, హైదరాబాద్**

శమదమ గుణముల ప్రోవై
విమలసుధాంబుధినినేలు వేలుపుసతి శ్రీ
రమణీమణీసిరికి పద
కమలంబున బుట్టె కలువ కనులకు విందై!

**కశోర్ఘుల నాగేశ్వర్ శర్మ, ధర్మపురి**

కమలాకరమున శోభిత
కమలనయని సుజన హృదయ కమల స్తుత్య
మ్మివమల చరిత యా లక్ష్మిట
కమలంబున బుట్టెఁ గలువ కనులకు విందై.

**కొరుప్రోలు రాధాకృష్ణ రావు, మీర్పేట్, రంగారెడ్డి జిల్లా**

ప్రమదమునూహాచిత్రము
సుమములయేకత్వభావసుందరవనిలో,
మమతల కోవెలయందున
కమలంబునఁబుట్టెఁగలువగనులకువిందై.

**గుండా వేంకట సుబ్బ సహదేవుడు, ప్రొద్దుటూరు**

కమనీయంపు కవనమునఁ
గమలమటంచు సఖిమోము కలువలవియె నే
త్రములనఁ గవియనె, "జంటగ
కమలంబునఁ బుట్టెఁ గలువ గనులకు విందై!"

**పి.ఎల్. నాగేశ్వరరావు, హైదరాబాదు**

హిమగిరి సానువులందున
నమలిన సుందర జలాశయంబున గనగన్
సముచిత వర్ణంబులలోఁ
గమలంబునఁ బుట్టెఁ గలువ గనులకు విందై !!
(కమలము = నీరు)

**పెనుకొండ రామబ్రహ్మం, బెంగుళూరు**

తమి జన్య మార్పులకొదవ
సుమతులు శ్రమఁ దలఁచకఁ జన శోధన ఫలమున్
విమలమని యమలుపరచఁగఁ
గమలంబునఁ బుట్టెఁ గలువ కనులకు విందై

**మంకుశ్రీను, కొవ్వూరు, ప.గో. జిల్లా**

తమిమీర మధువు గ్రోలుచు
సమయంబును చూచుకొనక సాయంతనమున్
భ్రమరము చిక్కెను ముకుళిత
కమలంబున, పుట్టె కలువ కనులకు విందై.

**మరింగంటి శ్రీనివాస్, హైదరాబాద్**

హిమకరుడే దివి కేగన్
క్రమముగ మది దాగినట్టి కవి భావనలే
సముచిత రీతిగ నాహృ
త్కమలంబునఁ బుట్టెఁ గలువ కనులకు విందై...

**రాకుమార, గోదావరిఖని**

రమణీయకృతియశంబును
సుమనోహరచిత్రరాజ సురభిళజిగినిన్
తమికొనుకవితాంగన ముఖ
కమలంబునబుట్టె కలువకనులకువిందై.

**విద్వాన్ భైరపనేని పోతురాజు చౌదరి, హైదరాబాదు**

సుమరాశిన్ గొని సేవకు
రమణీ మణిరాగ విమల రమణీయత లో
శ్రమరానీయక శ్రీ పద
కమలంబునబుట్టెగలువ కనులకు విందై

**విమల ఆర్యసోమయాజుల, బెంగుళూరు**

విమలంబగు షోడశ కళ
లమరగ సోయగము చిందు యతివ ముఖంబే
కమలము; కన్నులు కలువలు
కమలంబున బుట్టె గలువ కనులకు విందై.

**వేగరాజు సాయి వర ప్రసాద్, హైదరాబాదు**

రమణీయంబుగ శశి గగ
నమందు విలసిల్లుచుండ నైసర్గికమౌ,
క్రమముగ నూరి కొలనులో
కమలంబునఁ బుట్టెఁ గలువ గనులకు విందై.
(కమలము = జలము)

**వేదాల గాయత్రీదేవి, హైదరాబాదు**

కమలము జయచిహ్నంబని
విమలముగాలేఖనమున విద్యార్థి యిలన్
సుమమును లిఖింప నందున
కమలంబున పుట్టె కలువ కనులకు విందై.

**శ్రీనివాస్ లింగం**

కుముదేశుని వెన్నెలలో,
సుమముల సరసునను తొంగి చూచిన వేళన్!
సుమనోహర రమణి నయన
కమలంబునఁ బుట్టెఁ గలువ గనులకు విందై.

## దత్తపది

**'ఆటో - కారు - జీపు - లారీ' పదాలను ఉపయోగిస్తూ మహాభారతార్థంలో స్వేచ్ఛాఛందం**

**అన్నపరెడ్డి సత్యనారాయణ రెడ్డి, హైదరాబాదు**

(సంజయుడు ధృతరాష్ట్రునితో)

తే. ఎట్టి యాటోపమును జూపనట్టి ఘనులు
కారు పాండువు లనిలోన భీరు లెపుడు
సమరమున సమ యుజ్జీ పుడమిని గనము
నిండు సభ నబ లారీతి నుండ చెఱపు.

**ఆకుల శాంతిభూషణ్, వనపర్తి**

శా. ఆలోకించు సుయోధనా!వినుమయా!ఆ టోకరా చేయబో
కేలా రీతిని దప్పి యుండెదవు? రాజ్యేచ్ఛన్ దొలంగించుమా!
నీ లోభమ్మును వీడి భాగమిడినన్ నీకారు ప్రఖ్యాతి, స
చ్ఛీలమ్మున్ విడబోక చేకొనిన రాజీ, పుణ్యమే యిద్దియున్.

**ఆరవల్లి శ్రీదేవి, హైదరాబాద్**

శా. ఆటోపంబుల జూపకే మసలగా నజ్ఞాతవాసమ్ము, పో
రో, టక్కున్ భరియించి వచ్చి పలు కారుల్ ప్రేలగానోర్చి వే
దాటంబోవగ దల్చి జీపున బడన్ దంబంబు గూల్చంగ నా
మాటెల్లారికి బుద్ధి నేర్ప తగునౌ మాపాలు మే మేమెంచగన్!

**గుండా వేంకట సుబ్బ సహదేవుడు, ప్రొద్దుటూరు**

తే. కీచకుని పటాటోపాన ఛిన్నయగుచుఁ
గలికి సైరంధ్రి కామవికారుఁ బిల్వఁ
జీపురట్లు నర్తన శాలఁ బాపి విఱువ
వదలె ప్రాణములారీతి వలలు వలన

**పి.ఎల్. నాగేశ్వరరావు, హైదరాబాదు**

సీ. కారుమబ్బులు గ్రమ్మఁ గలికి ద్రోవదియట
దినమొక యుగమౌచు దిగులుచెందఁ
వారింప వదలక పటాటోపముతోడఁ
గామ కీచకుడేగఁ గాంత దరికి
జీపుపై గ్రుద్దుచుఁ జేతులు విఱచుచున్
గూల్చి వానిని భీము క్రుద్ధుడౌచు
లారీకి సరిపడు రాక్షసు దేహంబు
నీడ్చె నావలికిఁ దా నిష్టపడుచు

ఆ.వె. జగతినుద్ధరించి సత్యమ్ము గాపాడఁ
గృష్ణమాయ దునిమె కీచకుణ్ణి!
దుష్టబుద్ధులకిలఁ గష్టముల్ తప్పునే?
కూలె 'సింహ'మిచట గుణములేక!
(జీపు = వీపు)

**పెనుకొండ రామబ్రహ్మం, బెంగుళూరు**

శా. ఆలోచించవౌ యుద్ధమన్న కనుమా ఆటో కులక్షీణమో
బాలల్ కారు గదయ్య నీ సుతులు సంభావించరో ధర్మమున్
రాలున్ ప్రాణము లెన్నొ కౌరవులకున్ రాజీ పురస్కార్యమౌ
మేలా రీతియు నీతి వీడుట నృపా మిత్రత్వమే శ్రేష్ఠమౌ.

**రాకుమార, గోదావరిఖని**

(విదురుడు సుయోధనుడితో)

తే.గీ. ఇల నహంకారు లగుచును కలహమాడి
తగని యాటోపము నెఱపు ధర్మమేల
రాజనందనా రాజీ పురాకృతంబు
రేసుదున్నలా రీతి మరిచెదవేల.

**విద్వాన్ భైరపనేని పోతరాజు చౌదరి, హైదరాబాద్**

శా. ఆటోపంబునుజూపికర్ణుడచటన్ హార్యక్ష గంభీరుడై
బీటల్వారగజేయ నర్జునునికిన్భీతిల్లి కారుంగలిన్
వాటంబౌగతిజీపురుంబలెజనెన్ వంచించు వాడెప్పుడున్
చేటుందెచ్చుత లారి బుద్ధి గలుగన్ సిద్ధింపవేయోగముల్.

**విమల ఆర్యసోమయాజుల, బెంగుళూరు**

శా. 'ఆటో'పమ్మున యుద్ధరంగమున కాహ్వానించగా కౌరవుల్
రాటల్ వోలెను నిల్చి మిత్రులు మహారా'జీపు' రంబేల గా
మాటే'లా రి'పులంచు పాండవులతో మధ్యాహ్నమార్తాండులై
గాటమ్మౌవిధి నమ్ములేసిరచటన్ 'కారు'ణ్యమేవీడుచున్.

**వేదాల గాయత్రీదేవి, హైదరాబాదు**

(దుర్యోధనునికి హితబోధ)

**సమస్య:** రావణాసురుడే జపించెను రామనామము భక్తితో
**దత్తపది:** కదన-వదన-రదన-సదన పదాలతో శ్రీరాముని స్తుతిస్తూ కందపద్యం వ్రాయాలి
(పూరణలు 15 మే 2026 లోపు 7702121376 ఫోన్ నంబరుకు పంపాలి)

# శ్రీ రామ స్తుతి

శ్రీ మన్మంజుల భారతీయ కవితాశేషప్రపంచోద్భవం
బేమార్తాండ కులీనుపుణ్యకథచే నింపారవాసించె నా
రాముండీజకరానిపల్లిసభనిర్వ్యాజానురాగంబునన్
మామాటన్ బ్రసరించుఁగాతకవితామాధ్వీకధారాఝరిన్

*శ్రీకరమైన, మంజులమైన, భారతీయ కవిత్వమనే అశేష ప్రపంచము ఏ సూర్యవంశానికి చెందిన మహారాజు పవిత్రమైన కథచే ఈ ప్రపంచమంతా మనోహరమై వాసికెక్కినదో ఆ సూర్యవంశోద్భవుడైన శ్రీరామచంద్రుడు తన నిర్వ్యాజమైన కృపా కటాక్షాలతో ఈ జక్రాన్‌పల్లిలో నిర్వహిస్తూ ఉన్న అవధాన సభలో మా మాటల ద్వారా కవిత్వమనే సుధా రసధారలను ప్రవహింప జేయుగాక!*

ఈ శ్రీరామచంద్రుని స్తుతి 1995వ సంవత్సరంలో జక్రాన్ పల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేసిన జంట అష్టావధానములో డాక్టర్.అవధానం రంగనాథ వాచస్పతి గారి ఇష్టదేవతాస్తుతి.

అశేషమైన భారతీయ కవిత్వమనే ప్రపంచము మార్తాండకులీనుడు అయిన శ్రీరామచంద్రుని కథచే అనగా... శ్రీమద్రామాయణముచే ప్రారంభమైనది ఇది లౌకిక సారస్వతానికి మూలము. దీని కర్త ఆదికవి వాల్మీకి మహర్షి.

లౌకిక సాహిత్యానికి ఆదికావ్యము రామాయణము ఈ రామాయణములోని నాయకుడు శ్రీరామచంద్రుడు కాబట్టి ఆదికావ్యానికి మూలపురుషుడైన శ్రీరామచంద్రుని కృపా కటాక్షములున్నచో కవితా సుధారసధారలు పొంగులెత్తుతాయని డాక్టర్ అవధానం రంగనాథ వాచస్పతి గారి భావన

**- డా. బోచ్కర్ ఓమ్ప్రకాశ్**

## తటిల్లతలు

ప్ర: కార్తవీర్యార్జునుడికి వెయ్యి చేతులు కదా! ఆకలి వేస్తే ఏ చేత్తో తింటాడు?

అ: అందుబాటులో ఏ చేయి దగ్గరగా ఉంటే ఆ చేత్తో తింటాడు.

ప్ర:అందరు దేవుళ్ళకీ బొట్లు, నామాలు ఉంటాయి కానీ వేంకటేశ్వరుడికి కళ్ళు కప్పేంత నామాలు ఎందుకండీ పెడతారు?

అ: కలి చాలా చెడ్డది. ఈ కలికాలంలో జరిగే పాపాలన్నీ చూడలేదని స్వామి కళ్ళు కప్పేశారని చెబుతారు. తిరుపతిలో మరో విశేషమేమంటే.. గురువారం నాడు నిజరూపదర్శనం చేయిస్తారు. అప్పుడు నామాలు తగ్గించి కళ్ళు కనపడేవిధంగా ఉంచుతారు. ఆ కళ్ళు చాలా తేజోవంతంగా ఉంటాయి. వాటిని చూడలేరనే ఉద్దేశ్యం కూడా ఉన్నది.

ప్ర: పొద్దు పొడిచింది. చంద్రుడు పొడిచాడు. చుక్క పొడించింది.. ఇలా అంటారు కదా!.. వీళ్ళందరూ ఎవరిని పొడుస్తారు?

అ: పొడవడం అంటే మీరనుకున్న పొడవడం కాదండీ.. పుట్టింది, ఉద్భవించింది అని అర్థం!

ప్ర: భాగవతంలో శివుడు హాలాహలాన్ని మ్రింగే సందర్భంలోని ఒకపద్యంలో "...సర్వమంగళ మంగళ సూత్రమ్మునెంత మది నమ్మినదో" అని అంటాడు పోతన. శివుడు మృత్యుంజయుడు. సాక్షాత్తూ యముడు శివుని ఆజ్ఞ ప్రకారం నడుచుకుంటాడు. అలాంటి శివుడి ప్రాణాలపై పార్వతీదేవికి భయముంటుందా!

అ: అక్కడ పోతనగారు చమత్కారంగా తెలుగునుడికారాన్ని చెప్పారు. పరమశివుడు గరళాన్ని మ్రింగడం వలన సర్వలోకాలకూ మంగళప్రదమవుతుందని భావన.

తే.గీ. భువి పటాటోపమేలనో భూషగాదు
కారు కూతలుచాలించు కౌరవేశ!
ఆఖలారి కృష్ణునికొని యాడి సాయ
మడుగ మంచిరోజీపుట మాన్యమగును.

**వేమరాజు వేంకట కృష్ణకుమార్**

(ఊహాజనిత సంభాషణ భీష్మ ధర్మరాజుల మధ్యన)

తే.గీ. కారు రాజులు ధర్మరక్షణను వీడు
నట్టి వారు; జీపును చూపనట్టివార;
లాచరించు మనుష్యుల నాదరించు;
దేశపు ప్రభుతలారీతి తిరుగ జరుగు
మంచి; ఆటోపము వలదు మహి నృపాల!

**వేగరాజు సాయి వర ప్రసాద్, హైదరాబాదు**

కం. కారుణ్యము కృష్ణు డిడని
కారణ మాటోపముగ బ్రకటితమ్మౌచున్
గౌరవులా రీతి సలుపు
చారము రాజీ పురికొన సడలుచు సంధిన్.

**శ్రీనివాస్ లింగం**

మ. కడు ఆటోపముఁ బొంది భీముడట సంగ్రామంబునన్ రుద్రుడై
వడిగా చంపె, వికారుడైన కురుపాపాత్ముండు, క్రూరుండు, దు
ష్టుడు, మాజీ పురరాజుఁజుమ్మి! ధృతరాష్ట్రుండయ్యేనేకాకి! కా
రడవుల్ వీడిరి పంచపాండవులు, కాలారీ! శివా! నీకృపన్.

# పద్యకవిత్వము సాధుప్రయోగాలు - 8

- 'అష్టావధాని' చిటితోటి విజయకుమార్

## విసర్గ సంధులు - 2

పదం చివర సకారం ఉంటే అది ముందు రేఫగా, తరువాత విసర్గగా మారుతుంది. ఇది సాధారణ ప్రక్రియ. ఉదాహరణకు **ధనుస్** అనే పదం **ధనుర్** అయి ఆపై **ధనుః** అవుతుంది. కనుక **ధనుస్ + విద్య = ధనుర్విద్య** అవుతుంది.

విసర్గకు క, ఖ, ప, ఫ లు పరమైతే విసర్గ మారదు అని చదువుకొన్నాం. దీనికి కొన్ని అపవాదాలు చూద్దాం.

1. **పాశ, కల్ప, క, కామ్య అనే ప్రత్యయాలు పరమైనప్పుడు విసర్గకు సకారం ఆదేశంగా వస్తుంది (అ.8.3.38).**

**పయః + పాశం = పయస్ పాశం = పయస్పాశం** (త్రాగుటకు పనికిరాని లేక చెడిపోయిన పాలు)

**యశః + కల్పం = యశస్ కల్పం = యశస్కల్పం** (కొంచెం కీర్తి)

**యశః + క = యశస్ క = యశస్క** (అజ్ఞాతమైన కీర్తి)

**యశః + కామ్య = యశస్కామ్య** (తనకు కీర్తిని కోరుకొను) అనేది ధాతువు అవుతుంది కనుక ఉదాహరణలు ఇవ్వడం లేదు. అయితే **యశః + కాముడు = యశస్కాముడు** అవుతుంది.

అయితే అవ్యయాల మీద ఈ సూత్రం వర్తించదు. **ప్రాతః + కల్పం = ప్రాతః కల్పం**

2. **విసర్గకు పూర్వం ఇకారం కానీ, ఉకారం కానీ ఉండి దానికి పాశ, కల్ప, క, కామ్య అనే ప్రత్యయాలు పరమైనప్పుడు విసర్గకు షకారం ఆదేశంగా వస్తుంది (అ.8.3.39). ఉదాహరణకు**

**సర్పిః + పాశం = సర్పిష్పాశం** (చెడిపోయిన నెయ్యి)

**సర్పిః + కల్పం = సర్పిష్కల్పం** (కొంచెం నెయ్యి)

అయితే అవ్యయం తరువాత విసర్గ వస్తే ఈ నియమం పనిచేయదు. **ఉచ్చైః + కల్పం = ఉచ్చైష్కల్పం కాదు.** విసర్గ లేదా జిహ్వామూలీయాలు వచ్చి (అ.8.3.37) **ఉచ్చైః కల్పం లేదా ఉచ్చై ≍కల్పం** అవుతుంది.

3. **గతి సంజ్ఞ ఉన్న నమః, పురః శబ్దాలకు క్రియాయోగమున్న క,ఖ,ప,ఫ లు పరమైతే విసర్గకు సకారం ఆదేశం అవుతుంది (అ.8.3.40).**

ఉదాహరణకు కృ ధాతువుతో క్రియాయోగమున్నప్పుడు **కార, కృతి** మొదలైన పదాలు వస్తాయి.

**నమః + కారము = నమస్కారము**

**పురః + కారము = పురస్కారము**

4. **నిః, దుః, బహిః, ఆవిః, చతుః, ప్రాదుః అనే పదాలకు క, ఖ, ప, ఫ లు పరమైతే విసర్గకు షకారం ఆదేశం అవుతుంది (అ.8.3.41).**

**నిః + కృతం = నిష్కృతం** (ప్రాయశ్చిత్తం చేయబడినది)

**నిః + ప్రత్యూహం = నిష్ప్రత్యూహం** (విఘ్నము లేనిది), **దుః + కృతం = దుష్కృతం, బహిః + కృతం = బహిష్కృతం, ఆవిః + కృతం = ఆవిష్కృతం** (ప్రకటితము), **ప్రాదుః + పీతం = ప్రాదుష్పీతం** (కళ్ళతో జుర్రబడినది, drunk in sight)

5. **తిరః శబ్దానికి క, ఖ, ప, ఫ లు పరమైతే విసర్గకు సకారం వికల్పంగా ఆదేశం అవుతుంది (అ.8.3.42).**

**తిరః + కృతి = తిరస్కృతి, తిరఃకృతి, తిర≍కృతి.**

6. **పదాంత విసర్గకు శ, ష, స లతో కూడుకొన్న ఖఫపఫలు పరమైతే విసర్గ మారదు. (అ. 8.3.35)**

**మనః + క్షోభ = మనః క్షోభ** (ఇక్కడ విసర్గకు షకారంతో కూడుకొన్న కకారం పరమైంది)

7. **సమాసవిషయంలో అవ్యయంకాని పదం చివర్లో ఉన్న విసర్గకు కృ/కమి/కంస/కుమ్భ/పాత్ర/కుశా/కర్ణీ పదాలు పరమైతే విసర్గకు నిత్యం సకారాదేశం అవుతుంది. అయితే పూర్వపర పదాలు కలిసి సమాసం కావాలి కానీ పూర్వ పదం సమాసం కాకూడదు. (అ.8.3.46)**

**అయః + కాంతము = అయస్కాంతము, అయః + కుంభము = అయస్కుంభము** (ఇనుపకుండ)

8. **పూర్వపరపదాలు సమాసం అయినప్పుడు అధః + పదం = అధస్పదం, శిరః + పదం = శిరస్పదం అవుతాయి (అ.8.3.47). ఇక్కడ విసర్గకు సకారాదేశం వచ్చింది.**

### మరికొన్ని విశేష సంధులు

**అహన్ + నిశలు = అహర్నిశలు** (అహన్ లోని నకారానికి రేఫ ఆదేశం అయింది)

**అహన్ + రాత్రులు = అహోరాత్రులు** (అహన్ లోని నకారానికి ఆదేశంగా వచ్చిన రుఁత్వానికి ఉత్వం ఆదేశం అయింది)

**నిర్ + రస = నీరస** (రేఫకు రేఫ ఆదేశం అయితే మొదటి రేఫ లోపించి దానికి పూర్వంగా ఉన్న అ,ఇ,ఉ లకు దీర్ఘం వస్తుంది).

**పుం + కోకిల = పుంస్కోకిల, సం + కర్తా = సంస్కర్తా**

(సౌలభ్యం కోసం సూత్రాల లోని కొంతభాగమే వివరించాను. అపవాదాలు, అసిద్ధాలు, తెలుగు పద్యాలకు అవసరం లేని సుత్రాలు మొదలైన వాటిని వివరించలేదు)

# వ్యాకరణ వరివస్య 8

ఎన్.సిహెచ్. చక్రవర్తి

తెలుగు భాషాపదాలను నాలుగు విధాలుగా విభజించారు బాలవ్యాకర్త. వాటి వివరాలు తెలుసుకుందాం.

మన భాషకు సంస్కృతప్రాకృతాలు తల్లివంటి భాషలు. ఆ భాషలనుండి మనం అనేక పదాలను తెచ్చుకున్నాం. కొన్ని ఆ భాషాపదాల ఆధారంగా పుట్టాయి. కొన్ని దేశీయనుడులు. కొన్ని జానపద వ్యవహారాలు.

ఈ విధంగా మన తెలుగు భాషా పదాలు తత్సమాలు, తద్భవాలు, దేశ్యాలు, గ్రామ్యాలు అని నాలుగు విధాలుగా వింగడించాడు.

**సంస్కృతప్రాకృత తుల్యంబగు భాష తత్సమంబు** సూత్రం.

సంస్కృత, ప్రాకృత భాషా పదాలను చిన్న చిన్న ప్రత్యయాలు చేర్చుకోవడం ద్వారా తెలుగు లోనికి తెచ్చుకుంటే వాటిని తత్సమాలు అంటాం. అంటే అవి సంస్కృత, ప్రాకృత భాషా పదాలతో సమమైన పదాలు.

రామః అన్న సంస్కృత పదం రాముడు అవుతుంది. విద్యా అనే సంస్కృత పదం తెలుగులో విద్య అవుతుంది.

అలాగే కారో అనే ప్రాకృత పదం తెలుగులో కారము అవుతుంది. అగ్గీ అనే పదం అగ్గి అవుతుంది.

ఈ పదాల స్వరూపాలు కూడా దాదాపు దగ్గరగా ఉంటాయి.

సంస్కృత ప్రాకృత భాషా పదాలనుండి పుట్టిన పదాలు తద్భవాలు.

**సంస్కృత ప్రాకృత భవంబగు భాష తద్భవంబు** సూత్రం.

ఆకాశః అనే సంస్కృత పదం నుండి ఆకసము అనే పదం పుట్టింది. కనుక ఆకసము అనే పదం తద్భవం. అలాగే అచ్ఛరా అనే ప్రాకృత పదం నుండి అచ్చేర అనే తెలుగు పదం పుట్టింది. కనుక ఆ పదం తద్భవం. ఇలాగ పరిశీలించుకుని, గ్రహించాలి.

తద్భవం అచ్చతెలుగుగా కూడా పరిగణింపబడుతుంది. సంస్కృత సమేతరాలు అచ్చతెలుగులు అని సూరి సూత్రించడం వల్ల ప్రాకృతసమపదాలకు కూడా అచ్చతెలుగు పదాలుగా పరిగణన.

**త్రిలింగదేశ వ్యవహార సిద్ధంబగు భాష దేశ్యంబు** అని సూత్రం.

అంటే తెలుగునాట స్వతహాగా ప్రజల వ్యవహారంలో ఉన్న భాష దేశ్యం.

ఉదాహరణకు: ఊరు, ఇల్లు, మేడ, తావి మొదలైన పదాలు.

**లక్షణ విరుద్ధంబగు భాష గ్రామ్యంబు** అని సూత్రం.

వ్యాకరణ లక్షణ విరుద్ధంగా ఉండే భాషకు గ్రామ్యం అని వ్యవహారం. జనపదాలలో సాధారణంగా జనుల(జానపదులు) ఉచ్చారణ వేరేగా ఉంటుంది. ఆ పదాలు గ్రామ్యపదాలు.

ఉదాహరణ: వస్తాడు, తెస్తాడు, వచ్చేటి, పోయేటి మొదలైన పదాలు... ఇవి వ్యాకరణ సూత్రాలకు లొంగవు.

**ఈ భాష ప్రయోగంబున కనర్హంబు** అని సూరి వివరించారు. వ్యాకరణ విరుద్ధమైన భాష కనుక గ్రామ్యభాష ప్రమాణ ప్రయోగాలలో వాడరాదని భావం.

ఒక్కోచోట జానపదుల సంభాషణలలో పూర్వకవులు ఈ భాషను విరళంగా వాడారు.

**మొక్కేము సామి, సూసి** వంటి ప్రయోగాలు ఉన్నాయి. అవి జానపదుల వ్యవహారంలో ప్రయోగింపబడ్డాయి. ఈ విషయాన్ని ప్రౌఢవ్యాకర్త గుర్తించి **గ్రామ్యంబు తత్తజ్జాతి వర్ణనంబునం బ్రయోగార్హంబగు** అని (సంజ్ఞా 14) సూత్రించాడు.

ఇది ప్రమాణ భాష కాదు కనుక కేవలం వ్యాకర్తలు చెప్పిన సందర్భాలలో మాత్రమే ఆమోదయోగ్యం అవుతుంది.

ఆధునికంగా భాషలో అనేక మార్పులు వచ్చాయి... ఆంగ్లం, ఉర్దూ వంటి భాషా పదాలు అనేకం వచ్చి చేరుతున్నాయి. రైలు, రోడ్డు వంటి చాలా ఆంగ్లపదాలు; అసలు, సిసలు, దర్జా, మజా వంటి అనేక ఉర్దూ పదాలు తెలుగుభాషాపదాలుగా చెలామణీ అవుతున్నాయి. వీటిని అన్యదేశ్య పదాలుగా పరిగణించవచ్చు. అయితే వాటికి తగిన పదాలు తెలుగులో లేనప్పుడు, అత్యవసరమైనప్పుడు మాత్రమే అన్యదేశ్యాలను వినియోగించాలి. విచ్చలవిడిగా వాడితే రచన ప్రామాణికత తగ్గిపోతుంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలి.

సంజ్ఞాపరిచ్ఛేదం చివరి సూత్రం **ఆర్య వ్యవహారంబుల దృష్టంబు గ్రాహ్యంబు** అని.

పూర్వకవుల ప్రయోగాలలో విరళంగా వ్యాకరణ సమ్మతం కాని ప్రయోగాలు ఉన్నాయి. వారు పూజ్యులు కనుక వారిపై గౌరవాదరాలతో సూరి గారు ఈ సూత్రం చెప్పారని గ్రహించాలి.

కఱకంఠుడు, ప్రాణగొడ్డము వంటి ప్రయోగాలు ఉన్నాయి. ఇవి లక్షణ విరుద్ధాలైన సమాసాలు. ప్రమాదికాలు. కనుక పూర్వకవుల ఇలాటి ప్రయోగాలను స్వీకరించాలి అని సూరి గారి భావన.

పూర్వకవులు చేశారు కనుక మనం వాటిని ఆమోదిస్తున్నాం కనుక తిరిగి మనం అలాటి ప్రయోగాలు చెయ్యరాదు. వాటి వరకు మాత్రమే స్వీకరించాలి తప్ప తిరిగి మనం ఆ ప్రయోగాలు చెయ్యరాదు. ఈ విషయాన్ని ఆధునికులు గ్రహించాలి.

ఇంతటితో బాల వ్యాకరణంలోని సంజ్ఞా పరిచ్ఛేదం పూర్తిఅయింది.

(సశేషం)

# కావ్యదోషాలు

డా॥ సూరం శ్రీనివాసులు




పదదోషాల తర్వాత తెలుసుకొనవలసినవి పదార్థ దోషాలు. వామనుని కావ్యాలంకారసూత్ర వృత్తి అయిదు పదార్థ దోషాలను చెప్తుంది. అవి అన్యార్థం. నేయార్థం, గూఢార్థం, అశ్లీలం, క్లిష్టం. అర్థం ఆ విధంగా ఉన్నప్పుడు ఆ అర్థాన్ని బోధిస్తున్న పదాలు దుష్టాలు అని అర్థం. పదం లేకుండా పదార్థముండదు కాబట్టి, ఆయా అర్థాలను బోధిస్తున్న కారణంగా ఆయా పదాలు తగనివి. అందుకే పదాన్ని జోడించి పదార్థదోషాలనటం.

**అన్యార్థం –**

రూఢిచ్యుత మన్యార్థమని వామన లక్షణం. రూఢి నుండీ జారిపోయిన అర్థంలో పదాన్ని ప్రయోగిస్తే అది అన్యార్థమనే దోషం. శబ్దవృత్తులు మూడు – అభిధ, లక్షణ, వ్యంజన అని. అభిధ సంకేతితార్థాన్ని ఇచ్చే శబ్దవృత్తి. ఇది రూఢిమూలం, యోగమూలం, యోగరూఢం, యౌగికరూఢం అని నాలుగు రకాలు. ఆలంకారికులు కొందరు మొదటి రెండు భేదాలనీ అంగీకరిస్తారు. రూఢిమూలాభిధ, యోగమూలాభిధ అని. నరసభూపాలీయం–

శబ్దవృత్తులు నభిధలక్షణ యనంగ
వ్యంజన యనంగఁ బెనుపొందు నందు నభిధ
సతత సంకేతితార్థ గోచర సుశబ్ద
ధామమై యోగరూఢి భేదములఁ జెలఁగు

వ్యుత్పత్త్యర్థ ప్రధానమైన పదం యోగమూలం. ‘చంద్రుడు’ పదానికి రేరాజు అని అర్థం తీసుకుంటున్నాం. అది ‘చది’ అనే ధాతువు మీద నుండి ఏర్పడిన పదం. ఆ ధాతువునకు ఆహ్లాదాన్ని కలిగించుట అని అర్థం. (చందయతి ఆహ్లాదయతి ఇతి చంద్రః). కాబట్టి వ్యుత్పత్తిని బట్టి చంద్రునికి ఆ పేరు. చంద్రుడు ఆహ్లాదకరుడు అన్నది ప్రసిద్ధమే. అలాగే తపింపజేసేవాడు తపనుడు (సూర్యుడు), రజింపజేసేవాడు రాజు –

యథా ప్రహ్లాదనాచ్చంద్రః ప్రతాపాత్తపనో యథా ।
తథైవ సో–భూదన్వర్థః రాజా ప్రకృతి రంజనాత్ ॥

రఘువంశంలో 4/12.

అని కాళిదాస ప్రయోగం

వ్యుత్పత్త్యర్థంతో సంబంధం లేకుండా ఒక నిర్దిష్టార్థంలో ప్రయోగింపబడే పదాలు రూఢిమూలాలు. ఇవి రెండు రకాలుగా వుంటాయి. గోడ, మేడ, పిల్లి, బల్లి, పువ్వు, నవ్వు ఇటువంటి పదాలు ఆయా అర్థాలలో రూఢాలు. అనగా వాటి వ్యుత్పత్తి మనకు తెలీదు. తెలుగు భాషలోని చాలా పదాలు అంతే. అవ్యుత్పన్నాలు. ఆంధ్రవిశ్వకళాపరిషత్ ప్రచురించిన తెలుగు వ్యుత్పత్తికోశం కొన్ని పదాలకు వ్యుత్పత్తులను సాధించగలిగింది, ఇతర ద్రావిడ భాషలతో తులనాత్మకంగా పరిశీలిస్తూ, మూలద్రావిడభాషతో సరిపోలుస్తూ. అయినా ఇప్పటికీ అధికశాతం అవ్యుత్పన్నాలే తెలుగులో.

ఇక రెండోరకం రూఢపదాలు. ఇవి సంస్కృతం నుండీ తెచ్చుకున్న తత్సమాలు. అక్కడ వ్యుత్పత్తిని బట్టి అనేకార్థాలు సంభవిస్తున్నా ఏదో ఒక అర్థానికి పరిమితం చేసి, ఆ పదాన్ని వాడటం. ఇది కూడా రూఢమే. పంకజం వంటి పదాలు. పంకం వలన పుట్టినది అని దాని వ్యుత్పత్తి. కాబట్టి బురదలో పుట్టినది ఏదైనా పంకజమే అయినా, ఆ పదాన్ని తామర అనే అర్థానికి పరిమితం చేసి వాడటం రూఢిమూలాభిద. ఇలా రూఢమైన పదాలను ఆ రూఢ్యర్థంలో కాకుండా యోగార్థంలో ప్రయోగించటం పదార్థదోషం. పంకజ పదానికి పద్మం అనే అర్థం తప్ప మరే అర్థమైనా రూఢిచ్యుతమే కాబట్టి “గాలి అనే అర్థంలో పంకజం వాడవచ్చునా? దోషమైతే అయ్యింది” అని భావించకూడదు. ఆ పదపదార్థాలకు సంబంధించిన అన్యార్థమే కావాలి, ఆ రూఢిచ్యుతమైన అర్థం అయినా – ఉదాహరణ

సునాసీరసూనుండు సూచె న్నిమజ్జి
జ్జనౌఘోత్పత త్పంక శంకాకరాత్మో
ర్మి నిర్మగ్న నీరేజ రేఖోన్నమ ద్భృం
గ నేత్రోత్సవశ్రీని గంగాభవానిన్

ఇక్కడ భవానీ శబ్దం భార్య అనే అర్థంలో ప్రయోగింపబడింది. భవుని భార్య అనేది భవానీ పద వ్యుత్పత్తి. పార్వతి అనే అర్థంలో ఆ పదం (భవాని) రూఢం. అయితే రూఢమైన పార్వతి అనే అర్థంలో కాకుండా యోగార్థమైన (భవుని భార్య) భవపత్ని అనే అర్థంలో – గంగను కూడా భవానీ పదంతో వ్యవహరిస్తూ వాడినందువల్ల ఇది అన్యార్థదోషం. భవానీ పదం పార్వతికి సరిపోతుంది కానీ గంగకు కాదు.

అయితే చేమకూర వేంకటకవికి పార్వతితో గంగకు సాపత్న్య

మున్నదన్న భావం చాలా దృఢంగా, పవిత్రంగా మనస్సులో నాటుకొని వుంది. దానికి కారణాన్ని కూడా వివరిస్తూ గంగను పొగుడుతాడు చూడండి –

తాసైరింప కపర్దయుండగ భవద్గర్భంబునందాల్చి తే
జో-సహ్యున్ శరజన్ము గాంచి యల నీహారక్షమాభృత్కుమా
రీసాపత్న్యము గన్న మోహపుపురంధ్రీ రత్నమౌదీవ; కా
దే సర్వజ్ఞన కేల నిన్నుఁ దలపైనెక్కించుకో జాహ్నవీ!

ఆ పవిత్ర భావంతోనే భవుని భార్య అనే యోగార్థంలో గంగను కూడా గంగాభవానిని చేశాడు చేమకూర. లాక్షణికులు దాన్ని తప్పుబడతారన్న ఆలోచన అయినా వచ్చిందో లేదో!

ఇది – అన్యార్థం – అనిత్యదోషం. ఎందుకంటే బంధకవిత్వం లోనూ, శ్లేషలోనూ ఇటువంటి పదాలను ప్రయోగించటం దోషం కాదు. పైపెచ్చు ప్రకృతాప్రకృతశ్లేషకు సహకరిస్తూ కావ్య సౌందర్యాన్ని పెంచుతుంది.

చతురాస్యుల్ పురుషోత్తముల్ బుధగురుల్ సర్వజ్ఞమూర్తుల్ మహా
శతమన్యుల్ శుచిధర్మపుణ్యజనతాశ్లాఘ్యుల్ ప్రచేతుల్ సదా
గతు లక్షీణ నవార్థకర్తలు కళాకాంతుల్ జగద్బంధులా
క్షితిదేవుల్ పురిదేవతామహిమలం జెన్నొందుటల్ చిత్రమే

– వసుచరిత్ర 1/97

ఇక్కడ అధిష్ఠానపురంలోని క్షితిదేవతలతో పోలిక వర్ణింపబడుతోంది. చతురాస్యుడు అంటే బ్రహ్మ. ఇది రూఢ్యర్థం. అయితే భూదేవులకు అది విశేషణమైనపుడు చతురమైన ఆస్యం గలవారు అనే యోగార్థంలో అన్వయిస్తుంది. అలాగే పురుషోత్తములు అని రూఢి (విష్ణుమూర్తులు), పురుషులలో శ్రేష్ఠులని యోగార్థం. సర్వజ్ఞమూర్తుల్, ప్రచేతుల్, సదాగతులు, మహా–శత–మన్యులు, శుచి–ధర్మ–పుణ్యజనతాశ్లాఘ్యుల్ ఇవన్నీ ఒక వైపు రూఢ్యర్థం లోనూ, మరోవైపు యోగార్థంతోనూ అన్వయిస్తాయి. ఇక్కడ యోగరూఢశ్లేష. ఇటువంటి తావులలో అన్యార్థం దోషం కాదు. పైగా ప్రతిభాసంపన్నతకు అద్దం పడుతుంది.

వర్తమానకాలంలోని రచనలలో ఇటువంటి దోషాలు తక్కువే. వాటికి గుణీభావమూ తక్కువే. కారణం? తెలుగు పదాల వ్యుత్పత్తిని గురించి ఆలోచించే అవకాశమూ తక్కువే. సంస్కృత పదాల వ్యుత్పత్తిని గురించి ఆలోచించే పాండిత్యమూ తక్కువే. నిష్పన్నమైన సంస్కృత పదజాలంతో సుదీర్ఘ సమాసరచన చేయటమే ప్రౌఢకవిత్వమన్న భ్రాంతిలోనే ఎక్కువమంది సాగుతున్నారు. అయినా ఒక్క తావున మాత్రం కవులకు ఆ పదవ్యుత్పత్తిని గురించి ఆలోచించవలసిన అవసరమేర్పడుతోంది. ఆ అవసరమిది –

అవధానాలలో సమస్యలలోనో, దత్తపదులుగానో పురాణేతిహాసప్రసిద్ధ పాత్రలను గుదిగ్రుచ్చి తదితరార్థంలో పూరించాలని ప్రశ్నించటం జరుగుతోంది. ఉదా – ధర్మరాజు, భీముడు, అర్జునుడు, సహదేవుడు – ఈ పదాలతో శ్రీరామ పాత్రచిత్రణ. ఈ పాదాలన్నీ పాండవుల పేర్లుగా రూఢాలు. ఇవి శ్రీరామపరంగా అన్వయించాలంటే ఇవి యోగమార్గాన అన్వయించక తప్పదు. ఇలాగే – **'భీముడు జానకిన్ వలచెం బెద్దలపై గల గౌరవంబునన్'** అని సమస్యనిస్తే రూఢంగా కుంతీనందనుని బోధించే భీమపదం యోగార్థప్రధానమై (అధర్మవర్తనులను) భయపెట్టేవారు అనే అర్థాన్ని ఇస్తూ, రామునికి విశేషణం కాక తప్పదు. లేదా ఉద్దేశ్యవిధేయభావంతో రామోద్దిష్టమైనా కాక తప్పదు.

వాస్తవంగా **'రూఢిః యోగాద్బలీయసీ'** అని యోగార్థం కన్నా రూఢ్యర్థం బలవత్తరమైనా శ్లేషలోనూ, అవధానప్రక్రియలలోనూ, బంధకవిత్వాదులలోనూ యోగార్థానికి గుర్తింపు వస్తుంది. సాధారణ కవిత్వంలో మాత్రం రూఢిని వదలి యోగార్థంలో ప్రయోగిస్తే అది అన్యార్థమనే పదార్థదోషం.

ఒకవేళ రెండు అర్థాలూ రూఢాలే అయితే అక్కడ శ్లేష లేక శబ్దశక్తిమూలధ్వని ప్రసక్తమవుతాయి.

ఉదా – పగలైనఁ దెల్వఁ గోల్పడని రాజులు, శరం
బులు చన్న వెలవెలఁబోని ఘనులు

వసుచరిత్ర 1/98

ఇక్కడ పగ+లు (ఒక అర్థంలో ఏకవచనం, ఒక అర్థంలో బహువచనం), రాజులు, శరంబులు, ఘనులు ద్వ్యర్థిపదాలు. అయితే ఆ అర్థాలు రెండూ రూఢాలే. కాబట్టి ఇక్కడ అన్యార్థప్రసక్తి లేదు.

ప్రసక్తానుప్రసక్తంగా ఈ అన్యార్థాన్ని గురించి ఒక చిన్న ప్రస్తావన. ఆధునికంగా అవధానాలలో ముఖ్యంగా దత్తపదిలో నాలుగు పదాలనిచ్చి "అన్యార్థంలో ప్రయోగిస్తూ... వర్ణించండి" అని అడుగుతున్నారు. అన్యార్థంలో ప్రయోగించమని అవధానిని ప్రశ్నిస్తూ ఆయన ప్రతిభను పరీక్షించడం మంచిదే. అయితే అన్యార్థదోషంలో ప్రస్తావించినట్లు ఆ పదాలు రూఢాలైతే ప్రశ్న సముచితం. కానీ, రూఢంగానే రెండు మూడు అర్థాలుంటే ఆ ప్రశ్న హాస్యాస్పదమవుతుంది. ఉదా – కరము పదం. దానికి చేయి, తొండము (సంస్కృతంలో), మిక్కిలి (తెలుగులో) అర్థాలు. అన్నీ రూఢ్యర్థాలే. కాబట్టి ఇటువంటి పదాలతో అన్యార్థంలో అంటూ దత్తపది అడిగేటప్పుడు ముందు తాము భావిస్తున్న అర్థాన్ని చెప్పి, తద్భిన్నార్థంలో వినియోగించమని అడగవచ్చు, ఆదేశించవచ్చు కూడా.

## ఈనెల అంశం: హాయి హాయిగా ఆమని సాగె

**శిష్ట్లా వి ఎల్ ఎన్ శర్మ**

ఉ. నిత్యమహోత్సవంబు రమణీయత చిందిలు రాగరాజ్ఞికిన్
ప్రత్యనుబంధ గంధమయి భాసిలు దివ్య సుగంధపుష్పముల్
నిత్య వివర్ధనాకృతి వినిర్మిత లాస్య వితర్దికా తతిన్
కృత్యముజేయు నీ యవని క్రేంకృతులొప్ప వసంతగానమై!

ఉ. ఏమి మహోత్సవంబు! మన మీ భువిమారుగ గాంచలేమె యీ
కోమలరూపరాశి కలకూజిత నిస్తుల శ్రావ్యరాగముల్
యీ మహియందె దక్కినవి యేర్పడ జేకొన బూదటిన్ దగన్
యే మహితాత్మ దాగినదొ యిట్టి వరమ్ముల నీయగా నిటన్!

ఉ. మల్లెలు మాలతీలతలు మామిడి కింశుక పుష్పహాసముల్
వెల్లువలైన వీ పగిది వీచికలై యెసలారి తావులన్
ల్లుచు గెలువారినవి సత్కళలన్నివరించి యిత్తతిన్
వెల్లిగొనంగ సౌరులు భువిన్ రహియించెను పూలకారునన్!

ఉ. తాముగ వచ్చి చేరె నవతామయ నిర్మల వైభవాకృతుల్
యీ మమతన్ ధ్వనించి యిట నేర్పడ జేయగ విశ్వవీధి నీ
హేమయమై వరించి విమలాప్త సుచేతన లావరాంచగా
నామని పాడె నీ వనిని హాయిగ సోయగమల్లి చిత్తమున్!

ఉ. హాయి జనించు నీ వని విహారము జేయగ విందుజేయు క
న్దోయిని సప్తవర్ణసుమ దోహల హేలల సాగిపో పసం
దాయెను చైత్రశోభలవియాకృతిదాల్చ మనోభిరామమై
దోయిలి మోడ్చి మ్రొక్కెద మదో! దరిసించు ముదమ్ముతోడుతన్!

**పెనుకొండ రామబ్రహ్మం బెంగుళూరు**

**అశ్వగతి** ఆమని ధాత్రినిఁ జొచ్చఁగ హాయి ఘటించు సదా
పూవుల రమ్య వికాశము పూన్చిన లాహిరిలోఁ
గోవెల గోడల చాటునఁ గోయిల గానసుధన్
భావన మీరఁగ సొక్కెదు భాగ్యమొసంగుఁ గదా!

**మధురాక్కర**
విరియు మావి చిగురుఁదిని ప్రియము మీర సుధా ఝరుల్
పరఁగు కోయిల గానము ప్రభవించు మోద హేలన్
దరుల కుసుమ సంపద కను తావుల ఘుమఘుమలన్
ధరణి నామని పొసఁగఁగఁ దారణ సంస్థితమౌ

**పంచచామరము**
పరాగ గంధమావహించ భావనా విచేష్టితన్
మరంద పాన వాంఛతో సమాశ్రయించు భృంగముల్
సరాగ మొప్పఁ గోయిలమ్మ శ్రావ్య గాన మాధురుల్
విరాజమానమై వసంత వీక్షణమ్ముఁ బొంగదా

# ఖండశర్కర

**నిర్వహణ: శతావధాని ఎం.వి. పట్వర్ధన్**
**అష్టావధాని చేపూరి శ్రీరామ్**

తరువోజ
క్రొత్త పూవుల తావి ఘుమఘుమ లలరఁ గోరి మావిచివురుఁ గొసరి మెసవఁగ
మత్తకోకిల గాన మాధురి వరల మారుని శరముల మగపోడి జనుల
చిత్తము దోచఁగఁ జిత్రరథుఁడటు శీతల మడఁచుచుఁ జెలగుచుండ ధర
నత్తటి సాగఁగ నామని హాయిహాయిగా నందమె యానంద మొసఁగు

కంద గర్భిత చంపకమాల
ధర నెరవై వసంతమటు స్థావర మైచన నూత్నపత్ర భా
సుర గరిమన్ సుమమ్ములు సుశోభలు గాంచఁగ వృక్ష సంపదా
పరి సరిక్రొత్త రూపుఁ గన భవ్య రసోజ్వల దివ్య దీప్తి ప
ర్ణ రుచిరమౌచుఁ బ్రీతిఁ గని రాజిల లోకము మోహమొందదే

కం. నెరవై వసంతమటు స్థా
వరమైచన నూత్నపత్ర భాసుర గరిమన్
సరిక్రొత్త రూపు గన భ
వ్య రసోజ్వల దివ్య పర్ణ రుచిరమౌ

**డా.రఘుపతి శాస్త్రుల, హైదరాబాద్**

ఉ. ఆమని శోభలన్నియును హాయిని గొల్పగ భూతలమ్ము ని
త్యామల దీప్తులం గని లతల్ తమ పుష్ప మరంద జాలపున్
మోముల కాంతి పుంజముల ముగ్ధ మనోహర వర్ణ కాంతులన్
క్షేమ హితార్థ దీవనల కేలుల కేళుల జాట రమ్యమౌ

ఉ. చల్లని పిల్ల తెమ్మెరల సంపద పంచగ శీత వాయువుల్
మెల్లని గమ్య మెన్నని సమీర పథమ్ముల, జీవ కోటిదౌ
ఉల్లములన్ ప్రసన్నతలు నొప్ప వసంతుడు, రక్తి తోడ సం
ధిల్లు సుమాస్త్ర జాలముల దీప్తులు కంతుని స్వాంత సంపదౌ

ఉ. ఓయి వసంత! కంతునట ఒంటరి సేయకు, నీదు అండయే
వాయు విశిష్ట సంపదల ప్రాభవమున్ గని జీవ కోటిదౌ
ప్రాయము నెన్ని అస్త్రముల రంజిల సేయగ నీదు స్నేహమే
సాయమొనర్చు నాతనికి, సన్మతి సంగతి గూర్చుమో సఖా!

ఉ. ఆమని పేరు సెప్పగనె అందము చిందు లతాంకురావళుల్,
మామిడి లేత పూతలును, మానసమందున విందుసేయు, వి

శ్వామర దైవమౌ ప్రకృతి సంపద రక్షను సేయ పృథ్వికిన్
క్షామము సోకనీయదనిశమ్మును కల్మినొసంగు శోభతో॥4

ఉ. కలుషిత మైన చేష్టలను కల్మషముల్ భువి పంచు మానవుల్
విలసితమైన యీ ప్రకృతి పేరిమి నెంచగ లేని దుర్గతిన్
పలుగతులన్ విషమ్ములను పంచగ గాంచి సహించి, పుష్టిదౌ
విలువల పెంచు పృథ్వి ప్రసవిత్రికి జోతల నంద జేసెదన్

### మంకు శ్రీను, కొప్పర్రు, ప.గో.జిల్లా

ఉ. మాసములందు దివ్య మధుమాసము గొప్పది యెంచి చూడగన్
మాసములందు రాజ్ఞియిది మంజుల భావములూరుచుండెడిన్
భాసురమైనశోభలు శుభంకరమై చెలువారునిద్ధరన్
దాసులు కారె యెల్లరును తన్మహిమన్ కొనియాడ శక్యమే

తే. ప్రకృతి దాల్చును పచ్చని పచ్చడంబు
కొమ్మకొమ్మలందున నవకమ్ములొప్ప
భ్రమరనాదంబులెల్లెడ రాణచెలగు
ఆమనిసొగసులకుసరిహద్దుకలదె

తే. చెట్టులన్ని చిగిర్చిరచించుహరిత
వర్ణ చిత్రమ్ము భూదేవి పటముపైని
చిత్రకారునకైన రచింప వశమె
ఇట్టి అందాలకామని యిరవు గాదె

తే. కొమ్మలందున గొంతెత్తి కోకిలమ్మ
కూయుచుండంగ భువికి విచ్చేయునిద్ది
సరస చైత్ర వైశాఖమాసంబులందు
నవ్యవైఖరులీపయి నాట్యమాడు

తే. హాయిహాయిగా ఆమని అధివసించె
మల్లెపూవుల తావులు వల్లె వేసె
శీతలపవనశ్రేణులుసేద తీర్చె
పుష్పధన్విపిహారంబు పూలకారు

### ఆకుల శాంతిభూషణ్, వనపర్తి

చ. గతమున రాలి పత్రములు క్ష్మాజములున్ వెలబోవుచుండగాన్
జితముగ క్రొత్త పర్ణములు చెన్నుగ నిచ్చుచు హాయి గూర్చగన్
ధృతిని ధరాతలమ్మునకు దీప్తులు దెచ్చుచు ప్రేమ వచ్చెడిన్
ఋతువుల రాణికిన్  మదిని హేల తనర్చగ స్వాగతంబిదే!

ఉ. మామిడి కొమ్మపై నిలిచి మానస మూయల నూగు రీతిగన్
కోమలమైన కోయిలయు కూయుచు పంచమ రాగ మందునన్
శ్యామము నింపుచున్ మనము జల్లన జేయుచు మత్తుగొల్పగన్
ప్రేమను జల్లుచున్ పిలిచె పిల్లలు పెద్దలు రండి రండహో!

ఉ. ఏమని చెప్పెదన్ సొగసు? నెట్టుల వర్ణన జేతు నందముల్
భూమి సమస్తమున్ పసిమి బొందుచు మిక్కిలి కాంతులీనగా
కాముడె నివ్వెఱొందె గద కానగ నీదగు సోయగమ్ములే
ఆమని గాంచ దివ్య మణిహారము గాదొకొ రత్నగర్భకున్?

శా. మల్లెల్ సర్వ లతాంతముల్ విరిసె సౌందర్యమ్మనే యిచ్చుచున్
పల్లెల్ మామిడి వేప పూత వలనన్ భాసిల్లె నెంతోగదా
ఉల్లాసంబును జిల్కుచున్  క్షితిజముల్ యోజస్సునే నింపుచున్
మెల్లన్ దిక్కుల నిండె సౌరభములే మెండై వసంతమ్మునన్

శా. వచ్చెన్ శోభన వత్సరం బిలకు పర్వంబై వసంతమ్ములో
తెచ్చెన్ షడ్రుచులన్ సమానమనుచున్ దెల్పెన్ సుఖమ్ముల్ వ్యథల్
మెచ్చున్ నూతన కార్యముల్ సలుపగన్ మేలౌను నిక్కాలమే
ఇచ్చున్  దీవెన స్వస్థతల్,విజయముల్, హేలల్ ఘటిల్లన్ సదా

## తదుపరి అంశం

### రసాలసాలం

పై అంశానికి 5 పద్యములను 9441039146
ఫోన్ నంబరుకు వాట్సప్ ద్వారా పంపగలరు
ఖండికలు పంపవలసిన ఆఖరు తేది
15 మే 2026

## తటిల్లతలు

ప్ర: సూర్యుడు అస్తమించిన చోటే ఉదయిస్తాడని కొందరు అంటున్నారు. అదెలా సాధ్యం?

అ: ఎవరైనా ఎక్కడ పడిపోతే అక్కడే కదండీ లేవాలి. సూర్యుడైనా అంతే. అయితే తూర్పుదేశాలలో అస్తమయం.. పశ్చిమ దేశాలలో ఉదయం అవుతుంది.

ప్ర: శివుడు దిగంబరుడు కదా! దిగంబరుడని అంటూ మళ్ళీ పులితోలు కట్టుకున్నాడనీ, ఏనుగుతోలు కట్టుకున్నాడనీ అంటుంటారు. దిగంబరుడు వస్త్రాలెందుకు ధరిస్తాడు?

అ: దిగంబరుడంటే దిక్కులంతా వ్యాపించినవాడని ఆయన విశ్వ వ్యాపకత్వాన్ని చెప్పటమే కానీ వస్త్రాలు ధరించడని కాదండీ!

ప్ర: పెళ్లికాని అమ్మాయిలు 'రుక్మిణీకల్యాణం' చదివితే వారికి పెళ్ళి అవుతుందని అంటారు కదా! చదివాక స్ఫూర్తి పొంది ఆ అమ్మాయి రుక్మిణి బాట పడితే తల్లిదండ్రుల పరిస్థితి ఏమిటి?

అ: ఈనాడు రుక్మిణీకల్యాణం ఆడపిల్లలు చదవాల్సిన అవసరమే లేదు. లోకంలో ఆడపిల్లలే దొరకటం లేదు. ఒకవేళ చదివితే రుక్మిణీ కల్యాణం మగపిల్లలే.. పెళ్ళికాని ప్రసాదులే చదవాలి.

ఈ నెల తటిల్లతలు
అవధాని: నారాయణం బాలసుబ్రహ్మణ్యం
అప్రస్తుత ప్రాశ్నికుడు: పంతుల విట్టుబాబు

# పద్యపరిమళం

## అభిరామాకృతి

- మల్లాప్రగడ శ్రీమన్నారాయణ మూర్తి.

కవులందరూ కావ్య నాయికల అంద చందాలను వర్ణిస్తారు. ప్రబంధ కవులు మరింత సొగసుగా గడుసుగా వర్ణిస్తారు.

కావ్య నాయిక జడ పామువలె ఉన్నదనీ, ఆమె పెదవి చిగురుటాకులా ఉన్నదనీ తేనెలు చిమ్ముతోందనీ, ఆమె నడుము సన్నగా సింహం నడుములా ఉన్నదనీ వర్ణిస్తారు. ఇది సర్వ సాధారణం.

సర్వసాధారణమైన ఈ అంశం ఆధారంగా అసాధారణమైన ఆలోచనను జోడించి, సీతాదేవి సౌందర్యాన్ని వర్ణించాడు అయ్యలరాజు రామభద్రకవి.

ఈ కవి రచించిన **"రామాభ్యుదయం"** 'ప్రబంధ కవితా రామాభ్యుదయమే.'

సీతాదేవి సౌందర్యం ఎలాంటిదో విశ్వామిత్రుని నోట పలికింప చేశాడు ఈ కవి. విశ్వామిత్రుడు సీతా సౌందర్యాన్ని వర్ణించటం విడ్డూరమే అయినా, వర్ణన మాత్రం విశిష్టంగా అనిపిస్తుంది. విలక్షణంగా ఉంటూనే సలక్షణంగా సాగిన వర్ణన ఇది.

**ఆ కరియాన వేనలి అనంత విలాసము; మాధవోదయం**
**బా కమలాయతాక్షి మధురాధర సీమ, హరిప్రకార మా**
**కోకిలవాణి మధ్యమున కూడిన; దింతియ కాదు,తాను రా**
**మాకృతి దాల్చె; నీ చెలువమంతయు ఆ యమ యందు చొప్పడున్**

ఈ మాటలు శ్రీరామునితో విశ్వామిత్రుడు చెప్పాడు ఈ ప్రబంధంలో. శ్లేష చమత్కారం ఆధారంగా సీత 'రామస్వరూపిణి' అని చెప్పటమే కవి ఆంతర్యం అనిపిస్తుంది.

అశోకవనంలో సీతను చూసిన హనుమ ఆమెలో శ్రీరాముని పోలికలను దర్శించాడని వాల్మీకి మహర్షి వర్ణించారు.

**అస్యా దేవ్యా యథారూపమ్ అంగ ప్రత్యంగ సౌష్ఠవమ్ ।**
**రామస్య చ యథారూపమ్ తస్యేయమసితేక్షణా ॥**

అనుకున్నాడు హనుమ. వాల్మీకి మహర్షి భావన అయ్యల రాజుకు ప్రేరణ అయి ఉండవచ్చు.

కరియాన– గజగమనం గలది సీత.

'కరియాన' అనే విశేషణం ఆమె సౌందర్య ప్రతిపాదకం మాత్రమే కాదు. నడిచే సమయంలో కనిపించే అందం ఆమె జడ కదులుతున్నప్పుడు మరింత బాగా తెలుస్తుంది. అందుకని, 'ఆ కరియాన వేనలి'ని వర్ణించాడు కవి.

ఆ వేనలి(కేశపాశం)ఎలా ఉన్నదీ అంటే ఎంతో విలాసంగా ఉన్నది. అది అనంతమైన విలాసం. అనంతుడు అంటే ఆదిశేషుడు కదా! ఆమె జడ పాములా ఉన్నది. ఆ పాము ఆదిశేషుడు.

అంతే కాదు. అనంతుడైన విష్ణుదేవుని విలాసమే ఆమెకు కేశపాశంగా అమరింది. రాముడు విష్ణువనీ సీత శ్రీమహాలక్ష్మి అనీ వేరుగా చెప్ప నక్కర లేదు కదా!

**"ఆ కరియాన వేనలి అనంత విలాసము".**

అలాగే ఆమె **'కమలాయతాక్షి'.**

సుకుమారమైన విశేషణం ఇది. పద్మపత్రాలవలె విశాలమైన నేత్రాలు ఆమెవి. ఆమె కమలా స్వరూపిణి.

ఆమె అధరసీమ మధురం. ఆ మధురిమ ఎలాంటిది? అది **'మాధవోదయం'**. మాధవం అంటే వసంతం. వసంతం రాగానే చెట్లన్నీ లేత చిగుళ్ళతో ప్రకాశిస్తూ ఉంటాయి. ఆ సీతాదేవి పెదవి లేలేత చిగురాకువలె ఉన్నది – అని కవి భావన.

అంతేకాదు. మాధవం – అంటే మధు సంబంధం. తేనెలూరే పెదవి – అన్నమాట. అంతేనా, కాదు. మాధవుడు అంటే విష్ణువే. అంటే రాముడే. రాముని 'అభ్యుదయమే' సీతకు మధురాధర సీమగా అమరింది.

**"మాధవోదయం బా కమలాయతాక్షి మధురాధర సీమ".**

ఇంత అందమైన, తీయనైన పెదవిగల ఆమె పలికితే, ఆమె కంఠస్వరంలో ఆ మాధుర్యం ప్రతిఫలిస్తుంది. ఆమె 'కోకిల వాణి' అని తెలుస్తుంది. ముగ్ధమనోహరమైన విశేషణం ఇది.

ఇంతకూ ఆ సీత నడుము ఎలా ఉన్నది? ఆమె నడుము సింహంనడుములా సన్నగా ఉన్నది. ఆమె 'హరిమధ్య'. హరి స్వరూపుడైన రాముడే ఆమెనడుము సొగసులో కూడి ఉన్నాడు.

**"హరి ప్రకార మా కోకిలవాణిమధ్యమున కూడినది".**

**"ఇంతియ కాదు".**

ఇంత మాత్రమే కాదు.ఆమె రాముని ఆకృతినే ధరించి అవతరించింది. ఆమె "ఇంతి"(స్త్రీ)మాత్రమే కాదు. ఆమె మామూలు స్త్రీమూర్తి కాదు.

**"తాను రామాకృతి దాల్చె".**

విష్ణువైన శ్రీరాముని రూపాన్నే తన సొగసుగా దిద్దుకుని దిగివచ్చిన సీతా మహాలక్ష్మి ఆమె.

అందుకే ఆ విశ్వామిత్రుడు చివరి మాటగా **"నీ చెలువ మంతయు ఆ యమయందు చొప్పడున్"** అన్నాడు.

ప్రబంధధోరణిలో కావ్య నాయిక సౌందర్యాన్ని వర్ణిస్తూనే అమె సీత కాదు, రాముడే అంటూ సీతారాముల అభేద అద్వైత స్థితిని అందంగా ప్రతిపాదించిన పద్య మిది. అభిరామాకృతి ఆ సీత. హృదయాభిరామం ఈ పద్యం.

# పద్యపరిమళం

వినుము మునీంద్ర! వేదనిధి, విష్ణునిభుండు పరాశరాత్మజుం
డనఘయశుండు సర్వనిగమార్థయుతంబును, సర్వధర్మ సా
ధనమును సర్వశాస్త్ర కలితంబును, సర్వకథాసుశోభితం
బును నగు భారతంబు కృతపుణ్యు డొనర్చె సవిస్తరంబుగన్

జలపూరము పాండవకథ
జలరుహనివహములు, విదితసరసాఖ్యానం
బులు, మృదుపదములు హంసం
బులు, మేదిని భారతాఖ్య బొలుచు కొలనికిన్

వ్యాసవాగ్జలపూర్ణయు, నాగమ ప్ల
వావతీర్ణయు, బహుకుతర్కావనీజ
హారిణియునైన భారతోదార తటిని
యదరి దురిత రజోరాశి నడచుచుండు

ఒనర బహువిశేషంబుల నుల్లసిల్లు
నట్టి భారతాఖ్యానంబు నందు గూఢ
తరములైన సమంచితార్థంబు లెఱుగ
దలచి వచ్చితి నీకడ కలఘుచరిత!

ఈ మహాభారత ప్రశంస మారన రచించిన మార్కండేయ పురాణంలోనిది. ఇవి కథా ప్రారంభ పద్యములే, మార్కండేయ మహర్షి తో చెప్పబడింది మార్కండేయ పురాణం.

ఈ పురాణం భారత వివరణ తోనే ప్రారంభం కావడం విశేషం.

మహాభారతం యొక్క ప్రాముఖ్యతను వివరిస్తున్నారు మారన.

తిక్కన సోమయాజి శిష్యునిగా భారతంపై తనకు గల అచంచల విశ్వాసం, కావ్యప్రౌఢిమ చాటే అవకాశం లభించింది మారనకు. ఈ పద్యాలు పురాణ ప్రారంభంలో జైమిని మహర్షి మార్కండేయ మహర్షిని అడుగుతున్న సందర్భం. భారతావతారికలో దుర్గమార్థజల యుక్తమైన భారత సముద్రంలోతు తెలుసుకోవడం సాధ్యమా అన్న ప్రశ్నకు మారన భారతం ద్వారా అదిసాధ్యమే అని తన విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. భారతం సర్వనిగమార్థ యుతం, సర్వధర్మసాధనం సర్వశాస్త్ర కలితంగా చెపుతూ మారన వ్యాసుని కృతపుణ్యునిగా పేర్కొన్నారు. ఈ భారతరచనవల్లే వ్యాసునికి ఆ పుణ్యం సిద్ధించింది. ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రమని, యధ్యాత్మవిదులు వేదాంతమనియు అన్న మహాభారతంలోని సీస పద్యం భావాన్ని ఈ పద్యం తెలియ జేస్తుంది.

నిజానికి కవిత్రయ మహాభారతం మారన చూసి ఉండకపోవచ్చు. చూసినా నన్నయ తిక్కనల అనువాదం మాత్రమే చూసి ఉండవచ్చు.

మహాభారతంలో భారతకథను సముద్రంతో పోల్చినట్లు మారన కొలనుతో పోల్చాడు. భారతమనే కొలనులో పాండవకథ జలపూరము, జలము అంటే ఎర్రతామర అనే అర్థంలో ఎర్రతామరలతో నిండిన కొలనుగా పేర్కొంటూ ఇందులో సరసమైన ఉపాఖ్యానాలు తామరల గుంపుతో పోల్చారు. అంటే ఆఖ్యానాలు విరివిగా ఉన్నాయని, మృదు పదములు హంసలుగా పేర్కొన్నారు. మృదు పదములు అని మారన పేర్కొనడంలోనూ తన గురువు తిక్కనను గుర్తుకు తెచ్చుకోవడమే అనిపిస్తుంది. అలతి అలతి పదాలలో అనల్పమైన భావం సృజించగల నేర్పు తిక్కన సొంతం. ఆ మృదుపదములను హంసలుగా భావిస్తున్నారు కవి. భారతం యొక్క విశేషాలు ఇంకా వివరిస్తూ ఇది వ్యాసుని వాక్కులనే జలాలతో పూర్ణంగా నిండియున్నది. పూర్ణము అనడంలో వ్యాసుడు ఇంకా ఏమీ మిగల్చకుండా పూర్తిగా చెప్పారని. ఆగమ ప్లవ అవతీర్ణమిది ఆగమశాస్త్ర సార జలాల్లో తనివితీరా స్నానం చేయవచ్చు. అంతే కాకుండా ఇది కుతర్కాలనే అవనీజములను కూల్చివేస్తుంది. ఇదీ గురువు గారిని పొగడడమే, అవైదిక మతాచారాలు, శైవ వైష్ణవ విభేదాలను కుతర్కాలుగా పరిగణించి తిక్కన హరిహరాద్వైతం ప్రకటిస్తూ అట్టి కుతర్కాలను ఖండించిన అంశం ఇది.

ఈ విధంగా భారతాన్ని ప్రశంసించిన మారనపద్యం చివర్లో ఒక ఆశ్చర్యకరమైన విషయం ప్రకటించారు ఇలాంటి బహువిశేషాలతో ఉల్లసిల్లే భారతంలో గూఢార్థాలు చాలా ఉన్నాయని వాటి అంతరార్థాలు తెలుసుకోవడానికి మీ దగ్గరకు వచ్చానని జైమిని మహర్షి మార్కండేయ మహర్షితో అంటారు. ఈ అంశం చింతనీయం. జైమిని మహర్షి ఎంతో గొప్పవాడు. తపస్సంపన్నుడు. అలాంటి వారికే అర్థం కాని అంశాలు ఉన్నాయంటే ఆశ్చర్యమే. ఇక సామాన్యుల పరిస్థితి ఏంటి? ఇటీవల పెద్దలు శ్రీ ఏల్చూరి మురళీధరరావుగారు ఇటీవల ప్రచురించిన తమ పుస్తకంలో తెలుగు వాఙ్మయంలో వ్యాసఘట్టాలు అనే ప్రస్తావనలో వారూహించిన వ్యాసఘట్టాలు ఇవేనా అని కూడా ఆశ్చర్యం కలుగుతుంది. ఒకవేళ ఇలాంటి గ్రంథిగ్రంథులు ఉంటే మార్కండేయ పురాణంలో వాటికి జవాబులు దొరికాయా అన్న సందేహం తలెత్తుతుంది.

ఏది ఏమైనా భారతంలోని గూఢతరమైన అంశాలకు సంబంధించిన వివరాలు ఈ పురాణంలో లభిస్తాయని మారన నమ్మకం. మారన తిక్కన దాదాపు సమకాలికులు. వీరు భారతం తెనిగిస్తున్న అంశం అప్పటివారందరికీ తెలిసే ఉంటుంది. సంస్కృత భారతంలోని వ్యాసఘట్టాలకు బహుశాసంస్కృత మార్కండేయ పురాణ రచయిత సమాధానాలు ఇచ్చాడా దానినే మారన స్వీకరించారా ఆలోచించాలి. ఎందుకంటే మారన ఆంధ్రానువాదమే చేసాడు కాబట్టి.

-చేపూరి శ్రీరాం

# సంస్కృతం సంస్కృతి 8

నారుమంచి వేంకట అనంతకృష్ణ శర్మ

వీనామవాచక శబ్దాల గురించి తెలుసుకునే క్రమములో గత సంచికల్లో శబ్దాలు నేర్చుకున్నప్పుడు వాటి విభక్తి రూపాలు, విభక్తి రూపాలతో పదాలను అమర్చుకుని వాక్యనిర్మాణం చేసేటప్పుడు ఏ విభక్తి వాడాలి, తెలుగులో వలెనే సాధారణముగా ఇక్కడ సమాన విభక్తి వాడబడుతున్నదని చూసాం. ఇప్పుడు నామవాచక అధ్యయన విధానాన్ని మరికొంత ఈ భాగములో చూసే ప్రయత్నం చేద్దాం.

తెలుగులో రాముడు అన్న పదానికి, రాముడు అని, దాశరథి, రాఘవుడు, సీతాపతి, రామచంద్ర అని వేరువేరు పదాలను ప్రయోగిస్తాము. అన్నీ ఒకరినే సూచిస్తాయి. కానీ అవి సమానార్థకాలు అనలేము. ఎందుకంటే పదము పుట్టడానికి దాని వెనుక ఒక ధాతువు లేక ఒక క్రియాసంబంధిగా ఈ నామవాచకములుంటాయి. ఉదాహరణకి అరణ్యములో అగస్త్యాశ్రమానికి వచ్చినప్పుడు రాముడు తనని దశరథపుత్రునిగా పరిచయం చేసుకోవడం సమంజసము. అదే రావణ సంహారమప్పుడు సీతాపతి నామం ఉచితముగా ఉంటుంది కదా. ఇది ఒక విధమైతే ఒకే పదానికి పలు అర్థాలు ఉండటం. ఉదాహరణకి అశ్వః అన్న పదం చూడండి. అశ్వః అంటే గుర్రం అంటాం. న+ శ్వః అన్నది కూడా న తత్పురుష సమాసములో అశ్వః అన్న రూపాన్నే పొందుతుంది. ఇక్కడ అర్థం రేపు లేనిది అని. సంస్కృతములో ఇలాంటివి అనేకం కలవు.

అయితే ఇలా పలు అర్థాలను స్ఫురింపచేసినంత మాత్రాన అన్నీ ఇలా వాడలేము. ఎందుకంటే శబ్దములు మూడు రకాలుగా విభజించారకారికులు. యోగికములు, యోగరూఢములు, రూఢములు అని. పాచక అన్న మాట విన్నప్పుడు మనకి పచనం అన్న అర్థం స్ఫురింపచేస్తుంది -పచ్ అన్న శబ్దము. దానికి ఒక ప్రత్యయము చేరి పాచక రూపం ఏర్పడినది. ఇలా పదములోని అవయవార్థ సంబంధము తో మనకి అర్థము వస్తే అలాంటి వాటిని యోగికములైన శబ్దములు అంటారు. అయితే కొన్ని ఇలా అవయవార్థ సంబంధము లేకపోయినా, లోక ప్రసిద్ధముగా వాడబడే పర్వము వంటి శబ్దములు కొన్ని ఉంటాయి. వీటిని రూఢములు లేక రూఢశబ్దములుగా గుర్తిస్తారు. ఇక మూడవ రకం శబ్దములు యోగరూఢములు. అంటే యౌగిక శబ్దము వలె అవయవార్థ సంబంధము ఉంటుంది అలాగే లోక ప్రసిద్ధి ప్రయోగము కూడా కలిసిఉంటుంది. పంకజ అన్న శబ్దాన్ని చూడండి. పంకము నుండి పుట్టినది, అది నాచు, సూక్ష్మజల చరములు, కమలము పాకుడు ఇలా, యౌగికమైన అర్థములు సిద్ధిస్తున్నప్పటికి, పంకజము అన్నది కేవలము తామరకే రూఢమైనది. అంటే ఇతరార్థములలో వాడరాదు అన్నమాట. వీటిని యోగ రూఢములు అంటారు.

అందుకే సాహిత్యం బాగా చదవాలి. చదువుతున్న లక్ష్యం భాషాప్రయోగ విశేషాల గమనిక, పరిశీలన, ప్రయోజనము ఇత్యాది తెలుసుకోవడం. స్థూల భావము తెలిసికోవడం కాకుండా ప్రతి పద పరిశీలన, దాని ఔచిత్యము గమనించాలి. ఇది మనకి పెద్ద పెద్ద కావ్యాలలోనే కాదు చిన్న చిన్న స్తోత్రసాహిత్యములో కూడా గమనించవచ్చు. ఉదాహరణకి చంద్రశేఖర అన్నా నీలకంథర అన్న గణములలో కానీ పలికే లయలోకాని ఏమీ భేదం లేదు. కానీ 'చంద్రశేఖర చంద్రశేఖర చంద్రశేఖర పాహిమాం' అన్నారు. అక్కడ నీలకంథర శబ్దము వ్యాకరణము, ఛందస్సు రీత్యా తప్పుకాదు కానీ భావము సాహిత్యము రీత్యా పొసగదు. చంద్రుడు శీతకిరణుడు, అమృతాంశుః అని కూడా పేరు. అక్కడ స్తోత్రం చేస్తున్నది 'మృత్యుభీతి' తో భయుఅపడుతున్న మార్కండేయుడు. మృత్యువుకి విరుగుడు అమృతత్త్వమే కానీ విషము కంఠములో కలిగిన స్వామి అని కాదు. అలాంటి శీతలకరుడిని ఒక ఆభరణముగా చేసుకున్న శివా అనడంలో ఔచిత్యం ఉంటుంది కదా.

ఇంక సంస్కృతములో ఒక నామవాచక పదమునుండి దానికి సంబంధించిన వేరే అర్థము నిచ్చే నామవాచక పదాలు అనేకం సృష్టించుకోవచ్చు. ఉదాహరణకి పతంజలి అన్న పదం ఉన్నదనుకోండి. అది ఒక పేరు. దానినుండి వేరే పదం అంటే 'పాతంజలం' అన్నది పుట్టింది. దీని అర్థం పతంజలికి సంబంధించిన అని. ఇలా వచ్చే పదాలను తద్ధితాంత పదాలు అంటారు. తత్ + హిత అంటే తద్ధిత. వీటిని ఏ అర్థములో ఏ తద్ధిత ప్రత్యయము వినియోగించాలో ఏ ప్రత్యయము వాడితే ఏ అర్థములో కొత్తపదం వస్తుందో తెలిపేందుకు పాణిని రెండు అధ్యాయాలనే కేటాయించారు. ఉదాహరణకి మతుప్ అనే ప్రత్యయం తీసుకోండి. డబ్బు అనే అర్థంలోని ధనం అనే పదానికి మతుప్ అనే ప్రత్యయము చేరిస్తే ధనమత్ అవుతుంది. దీని నుండి ధనము కలవాడు అనే అర్థములో ధనవాన్, ధనవతీ అనే పుం, స్త్రీలింగ రూపాలు వస్తాయి. అదే ధనం అనే పదానికి ఇని అనే ప్రత్యయము చేరిస్తే ఇదే అర్థంలో ధనీ అన్న పదం వస్తుంది.

అలాగే ధాతువుల నుండి మరొక రకమైన ప్రత్యయాలు ( కృత్ ప్రత్యయాలు) చేర్చుట ద్వారా క్రియాపదాలను నామవాచక పదాలుగా మార్చుకోవచ్చు. ఇలా అనంతమైన పదసంపదను నిర్మించుకోవచ్చు.

అవధానులకు ఈ తద్ధితప్రత్యయాలు, కృత్ ప్రత్యయాలు తెలియడం ద్వారా అనేక కొత్త పదాలు నిర్మించుకోవచ్చు, సారవంతమైన పద్యాలు తమ పూరణలలో రాబట్టవచ్చు. కనుక సంస్కృతం నేర్చుకోవడం అవధానవిద్యలో రాణించాలనుకునేవారికి అత్యావశ్యకమైన అంశం అన్నది స్పష్టము కదా. పూర్వావధానుల పూరణలు మీరు గమనించినట్లైతే ఇలాంటి విశేషాలు అనేకం మీరు అనుభవ పూర్వకముగా తెలుసుకోగలరు. పై సంచికలో ధాతువులు వాటి గురించి మరికొన్ని వివరాలు చూద్దాం.







అవధాన దర్శనమ్ నెలనెలా అష్టావధానం కార్యక్రమంలో భాగంగా

**దర్శనమ్** కార్యాలయం, శ్రీరామ సిద్ధాంతి భవనంలో

29-03-2026, ఆదివారం ఉదయం 9 గంటలకు జరిగిన

బాలకవి చి. వింజమూరి సంకీర్త్య శర్మ అష్టావధానం

అవధాన విద్యా విజయతే తరామ్

Avadhana Puskarini
19 APR 2026

# అవధాన విద్యా వికాస పరిషత్

భాగ్యనగరం

## ప్రకటన

దైవదత్తమైన ప్రతిభకు వ్యుత్పన్నత తోడైతే, లభించిన పాండిత్యాన్ని నిరంతర అభ్యాసంతో పదునుపెడుతుంటే శిలలాంటి వాడైనా శిల్పంగా మారవచ్చు.

**సాధనాత్ సాధ్యతే సర్వమ్**

అనే లక్ష్యంతోనే అవధాన విద్యా వికాస పరిషత్ ఆవిర్భవించింది.

తెలుగుభాషకే స్వంతమైన అవధానవిద్యను భావితరాలకు పదిలంగా అందించాలనే సదుద్దేశంతో గత నాలుగు సంవత్సరాలుగా మేము చేస్తున్న ప్రయత్నాలు సత్ఫలితాలనిస్తుడడం అందరెఱిగిందే. అదే ఒరవడిలో **2026 మే నెల 18వ తేదీనుండి 24 వతేదీ వరకు** ఐదవ శిక్షణ శిబిరాన్ని భాగ్యనగరంలో నిర్వహించ దలచాము.

**వేదిక:** సెయింట్ మార్క్స్ హైస్కూల్, దీనదయాల్ నగర్, నేరేడుమెట్టు, మల్కాజిగిరి, హైదరాబాద్

ఔత్సాహికులు సంసిద్ధులు కండి. మీ సంసిద్ధతను 9441039146 లేదా 9441491900 లేదా 8555082034 నెంబర్‌లకు తెలియజేయండి.

**Published by**
Avadhana Vidya Vikasa Parishat
Sri Rama Sadanam, 29-1499/6/1, Road No.1
West Kakatiya Nagar, Neredmet, Secunderabad - 500056
Ph: 9441039146